


Truth of News
RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | అన్నమయ్య జిల్లా | సంచిక : 284 | బుధవారం 29 ఏప్రిల్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

- అగమ్యగోచరంగా అమెరికా పరిస్థితి చర్చలపై ఇరాన్ సమాలోచనలు
- అగమ్యగోచరంగా అమెరికా పరిస్థితి
- ముందుకెళ్తే చైనా..వెనక్కొస్తే ఇరాన్
- యుద్ధంలో ఇరుక్కున్న ట్రంప్
- ఒపెక్, ఒపెక్ ప్లస్‌కు యూఏఈ గుడ్‌బై

## ఇరాన్ శాంతి ప్రతిపాదనలకు
# రష్యా మధ్యవర్తిత్వం

టెహ్రాన్/వాషింగ్టన్ - సూర్య వాస్తవం :

రష్యా అందిస్తున్న మద్దతుకు, సంఘీభావానికి ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ కృతజ్ఞతలు తెలిపారు. అరాగ్చీ సోమవారం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో సమావేశమైన విషయం తెలిసిందే. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలను నివారించే విషయంలో మధ్యవర్తిత్వం వహించేందుకు రష్యా సానుకూలత వ్యక్తం చేసిందని సమాచారం. చర్చలను తిరిగి ప్రారంభించాలన్న అమెరికా అభ్యర్థనను ఇరాన్ పరిశీలిస్తోందని అరాగ్చీ తెలిపారు. తొలి విడత చర్చలు విఫలం కావడానికి అమెరికాయే కారణమని ఆయన ఆరోపించారు. ఇరాన్‌కు చెందిన రెండు చమురు నౌకలు మెజెస్టిక్ ఎక్స్, తిఫానీలను అమెరికా స్వాధీనం చేసుకోవడంపై టెహ్రాన్ విదేశాంగ శాఖ మండిపడింది. ఈ చర్య సముద్ర దోపిడీని చట్టబద్ధం చేస్తోందని

- మిగతా 2లో..





## 9400 ఖాతాలను
# నిషేధించాం

- డిజిటల్ అరెస్టులపై సుప్రీంకోర్టులో వాట్సాప్ డాక్యుమెంట్ వెల్లడి

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం :

స్వతంత్ర దర్యాప్తులు నిర్వహించిన అనంతరం డిజిటల్ అరెస్టులు, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అమలు నకిలీ అధికారులతో సంబంధముందని గుర్తించిన 9400 ఖాతాలను నిషేధించినట్టు వాట్సాప్, హోం శాఖకు తెలియచేసినట్టు సుప్రీంకోర్టులో నమోదు చేసిన పత్రాలు పేర్కొన్నాయి. 'సీడ్' (వ్యక్తిగత స్కామర్లు) పై

- మిగతా 2లో..

# రెండు రైళ్లు ఢీ..
# 14 మంది మృతి

హైదరాబాద్ - సూర్య వాస్తవం



ఇండోనేషియా రాజధాని జకార్తా సమీపంలో జరిగిన రెండు రైళ్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో 14 మంది మృతి చెందారు. 84 మందికిగా గాయాలయ్యాయి అని రైలు నిర్వహణ సంస్థ మంగళవారం తెలిపింది. సహాయక సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్స్ చేపట్టి శిథిలాల కింద వారిని బయటకు తీశారు. జకార్తాకు సమీపంలోని బెకాసిలో సోమవారం రాత్రి ఒక ప్రయాణీకుల రైలు, ఒక సుదూర ప్రాంత రైలు (సిటీ రైలు) ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంపై ఇండోనేషియా ప్రభుత్వ రైల్వే సంస్థ పీటీ కేఏఐ ముఖ్య కార్యనిర్వహణాధికారి బాబీ రషీదిన్ మీడియాతో మాట్లాడుతూ.. 'ఈ ఘటన సోమవారం రాత్రి జరిగింది. ప్రయాణీకుల రైలు మొదట పట్టాలపై ఉన్న టాక్సీని ఢీకొట్టింది. ఆ తర్వాత ఆ రైలును సుదూర ప్రాంత రైలు రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య 14కు పెరిగిందని తెలిపారు. మహిళలు మాత్రమే ప్రయాణించే బోగీ ఈ ప్రమాదంలో తీవ్రంగా దెబ్బతింది. బాధితులందరూ మహిళలే. ఆ బోగీల్లో నుజ్జునుజ్జయిన ఇనుప కడ్డీల కింద మహిళల మృతదేహాలున్నాయి. రెస్క్యూ సిబ్బంది రైళ్లను విడదీయడానికి ముందు, యాంగిల్ గ్రైండర్లను ఉపయోగించి కంపార్ట్‌మెంట్ల లోహాన్ని కోసి, ప్రాణాలతో ఉన్నవారిని బయటకు తీశారు.

- మిగతా 2లో..



## నేడు పశ్చిమ బెంగాల్‌లో
# ఎన్నికలు

- రెండోదశలో 142 స్థానాలకు పోలింగ్
- ఓటరు చేతిలో 1,448 మంది అభ్యర్థుల భవితవ్యం
- మే 4న తుది ఫలితాలు

కోల్‌కతా - సూర్య వాస్తవం :

పశ్చిమబెంగాల్‌లో బుధవారం రెండోదశ పోలింగ్ జరగనున్నది. ఏడు జిల్లాల పరిధిలోని 142 నియోజకవర్గాల్లో ఉన్న సుమారు 3.21 కోట్ల మంది ఓటర్లు 1,448 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని నిర్ణయించనున్నారు. ఈ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు మే 4న జరుగుతుంది. మొదటి దశ పోలింగ్‌లో 90 శాతానికి పైగా ఓటింగ్ నమోదై రికార్డు సృష్టించింది.

**మోహరించిన కేంద్రబలగాలు**

ఈ మేరకు ఎన్నికల సంఘం(ఈసీ)

- మిగతా 2లో..

# బీజేపీలో
# ఆప్ ఎంపీల విలీనం

- ఆమోదించిన రాజ్యసభ ఛైర్మెన్ సీపీ రాధాకృష్ణన్
- మూడుకు పడిపోయిన ఆప్ ఎంపీల సంఖ్య

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం :

ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఏడుగురు రాజ్యసభ సభ్యులు బీజేపీలో విలీనమవ్వడానికి రాజ్యసభ ఛైర్మెన్ సీపీ రాధాకృష్ణన్ ఆమోదం తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఆమోదం తెలిపినట్టు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో రాజ్యసభలో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. ఈ విలీనంతో బీజేపీ సంఖ్యాబలం భారీగా పెరిగింది. ఆప్ సభ్యుల సంఖ్య గణనీయంగా తగ్గింది. దీంతో రాజ్యసభ వెబ్‌సైట్ ప్రకారం.. ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీల సంఖ్య 10 నుంచి మూడుకు పడిపోయింది. ఇక బీజేపీ సంఖ్య 106 నుంచి 113కు చేరింది. ఇక రాజ్యసభలో ఎన్డీఏ బలం 141 నుంచి 148కి పెరిగింది. ఈ నెల 24న ఆప్ నుంచి రాఘవ్ చద్దా, సాందీప్ పాఠక్, అశోక్ మిట్టల్, హర్భజన్ సింగ్, స్వాతీ మాలివాల్ సహా ఏడుగురు రాజ్యసభ సభ్యులు బీజేపీలోకి ఫిరాయించారు. వీరి విలీనానికి రాజ్యసభ ఛైర్మెన్ ఆమోదం తెలపడంతో వారంతా బీజేపీ సభ్యులయ్యారు. విలీనం తరువాత తమను ఎంపీలుగానే పరిగణించాలని కోరుతూ ఈ ఏడుగురూ రాజ్యసభ ఛైర్మెన్‌కు వినతిపత్రం సమర్పించారు.

- మిగతా 2లో..



# విశాఖలో
# గూగుల్ ఏఐ హబ్..

- చంద్రబాబు, అశ్వినీ వైష్ణవ్ చేతుల మీదుగా శంకుస్థాపన
- 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడితో ఏర్పాటు
- అదానీ, ఎయిర్‌టెల్ భాగస్వామ్యంతో హైపర్ స్కేల్ డేటా సెంటర్
- పాల్గొన్న సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, రామ్మోహన్ నాయుడు
- ప్రాజెక్ట్ కోసం 600 ఎకరాలు కేటాయించిన ప్రభుత్వం

2లో

## ఎక్కడా లేని ఇంధన కొరత ఏపీలోనే
# ఎందుకొచ్చింది?

- ఇంధన సంక్షోభంపై కూటమి ప్రభుత్వాన్ని నిలదీసిన వైఎస్ షర్మిల
- రూ.500 డీజిల్ కోసం ఆక్వా రైతు పడిన ఆవేదనను ప్రస్తావించిన వైనం
- ఇది రైతును రక్షించే ప్రభుత్వమా, భక్షించే ప్రభుత్వమా అని ప్రశ్న
- మోదీకి తొత్తుగా ఉంటూ చంద్రబాబు బీజేపీ భజన చేస్తున్నారని విమర్శ
- వదంతులు నమ్మొద్దని చెప్పడం కాదు.. కళ్లు తెరవాలని చంద్రబాబుకు హితవు



2లో



## శుక్రాచార్యుడు ఫాంహౌస్‌లో పడుకున్నాడు..
# మారీచుడు, సుబాహుడు
# జనంలో తిరుగుతున్నారు

- ఫ్యూచర్ సిటీలో సీపీ భవనానికి సీఎం రేవంత్ శంకుస్థాపన
- ప్రపంచస్థాయి నగరంగా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తామని హామీ
- రైతులు భూములిచ్చి సహకరించాలని విజ్ఞప్తి
- ప్రతిపక్షాల మాటలు పట్టించుకోనని వ్యాఖ్య

హైదరాబాద్ - సూర్య వాస్తవం

ప్రజలను భాగస్వాములను చేస్తూ ఫ్యూచర్ సిటీని అధునాతన నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అందరూ కలిసి పనిచేస్తేనే సిటీ నిర్మాణం సాధ్యమవుతుందని సీపీ భవన

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# రెండు రైళ్లు ఢీ..
# 14 మంది మృతి

(మొదటిపేజీ తరువాయి)

మంగళవారం మృతుల బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని వారి బంధువులకు సంబంధించిన మృతదేహాలను వెతుకున్నారని పోలీసులు తెలిపారు. కాగా ఈ ఘటనపై అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంపై అధికారులు దర్యాప్తు చేస్తారని ఆయన తెలిపారు. రైలు నెట్‌వర్క్‌లోని చాలా భాగాలు సరిగా నిర్వహించబడటం లేనందు వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆయన అన్నారు. తీవ్రమైన ట్రాఫిక్ రద్దీని పరిష్కరించడంలో సహాయపడటానికి రైలు పట్టాల సమీపంలో ఒక ఫ్లైఓవర్ నిర్మించడానికి తాను అంగీకరించానన్నారు. ఈ ప్రమాదంపై ఇండోనేషియా జాతీయ రవాణా భద్రతా కమిటీ (కెఎన్‌కెటి) దర్యాప్తు చేస్తోంది. ఇజ్రాయిల్‌తో ప్రత్యక్ష చర్చల వల్ల లెబనాన్‌కు ఫలితాలు లేనట్లే ఉన్నాయి. ఈ చర్చలతో మాకెలాంటి సంబంధం లేదు. లెబనాన్, ఆ దేశ దాని ప్రజల కోసం మేము మా రక్షణాత్మక ప్రతిఘటనను కొనసాగిస్తాము అని నజీమ్ ఖాసిమ్ ప్రకటనలో పేర్కొన్నారు. శత్రువు ఎంత బెదిరించినా మేము వెనకడుగు వేయము. తలవంచము, ఓటమిని అంగీకరించము అని ఆయన ఇజ్రాయిల్ చర్యలపై ధీటుగా స్పందించారు.

# 9400 ఖాతాలను
# నిషేధించాం

(మొదటిపేజీ తరువాయి)

దృష్టి కేంద్రీకరించి, మూసివేయడం కంటే మొత్తంగా ఈ కుంభకోణాలకు పాల్పడుతున్నవారి నెట్‌వర్క్‌ను కూల్చివేయడంపై దృష్టి సారించినట్లు వాట్సాప్ తెలిపింది. ప్రధానంగా కంబోడియాలోనే వీరు చురుకుగా వున్నారని పేర్కొంది. దర్యాప్తు సంస్థలు, కేంద్ర ప్రభుత్వం పంపే హెచ్చరికల సంకేతాలను వేటికవి విడివిడిగా లేదా ఒక్కసారిగా వచ్చే నివేదికలుగా వ్యవహరించకుండా మొత్తంగా క్రిమినల్ నెట్‌వర్క్‌ను గుర్తించి, విచ్ఛిన్నం చేసేందుకు 'సీడ్'(మూలం)గా గుర్తించామని వాట్సాప్ డాక్యుమెంట్ పేర్కొంది. వాట్సాప్, హోం శాఖల మధ్య జరిగిన కమ్యూనికేషన్‌ను, ఇండియన్ సైబర్ నేరాల సమన్వయ కేంద్రం (14సి) తరపున హోం శాఖ దాఖలు చేసిన స్టేటస్ నివేదికకు జతపరిచారు. కేంద్ర హోం శాఖ తరపున సుప్రీంలో అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి వాదనలు వినిపించారు. మార్చిలో ప్రత్యేక కార్యదర్శి (అంతర్గత భద్రత) నేతృత్వంలో అంతర్ విభాగాల కమిటీ ఏర్పాటు చేసిన సమావేశంలో అనేక చర్యలపై చర్చ జరిగినట్లు ఆ నివేదిక పేర్కొంది. వాట్సాప్‌తో పాటూ ఎయిర్‌టెల్, వొడాఫోన్-ఐడియా, రిలయన్స్ జియో, బిఎస్ఎన్ఎస్ వంటి ప్రధాన టెలికం సర్వీస్ ప్రొవైడర్లను కూడా ఆహ్వానించారు. సిమ్ బైండింగ్ అంటే భౌతికంగా సిమ్ కార్డుతో ఖాతాను ముడిపెట్టడంపై పనిచేస్తున్నట్టు వాట్సాప్ తెలిపింది. అలాగే సమాచార సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన నిబంధనలను పాటించనున్నట్లు తెలిపింది. డిజిటల్ అరెస్టు కుంభకోణాల్లో ఉపయోగించిన ఫోన్లను గుర్తించి, వాటి ఐడిలను బ్లాక్ చేయడానికి అవసరమైన యంత్రాంగాలను ప్రవేశపెట్టాలని హోం శాఖ, ఇతర పక్షాలు అంగీకరించాయి. లా ఎన్‌ఫోర్స్‌మెంట్ నకిలీ అధికారులను, అలాగే అధికారిక లోగోలను, సమాచారాన్ని దుర్వినియోగం చేయడాన్ని గుర్తించేందుకు కృత్రిమ మేథస్సును, మెషిన్ లెర్నింగ్ ఆధారిత వ్యవస్థలను బలోపేతం చేయాలని అందుకోసం చర్యలు తీసుకుంటున్నట్టు వాట్సాప్ తెలిపింది.

## ఎక్కడా లేని ఇంధన కొరత ఏపీలోనే
# ఎందుకొచ్చింది?

- ఇంధన సంక్షోభంపై కూటమి ప్రభుత్వాన్ని నిలదీసిన వైఎస్ షర్మిల
- రూ.500 డీజిల్ కోసం ఆక్వా రైతు పడిన ఆవేదనను ప్రస్తావించిన వైనం
- ఇది రైతును రక్షించే ప్రభుత్వమా, భక్షించే ప్రభుత్వమా అని ప్రశ్న
- మోదీకి తొత్తుగా ఉంటూ చంద్రబాబు బీజేపీ భజన చేస్తున్నారని విమర్శ
- వదంతులు నమ్మొద్దని చెప్పడం కాదు.. కళ్లు తెరవాలని చంద్రబాబుకు హితవు

అమరావతి - సూర్య వాస్తవం :

రాష్ట్రంలో తీవ్ర ఇంధన సంక్షోభం ఏర్పడిందంటూ ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రూ.500 డీజిల్ కోసం ఓ ఆక్వా రైతు పడిన ఆవేదనను ప్రస్తావిస్తూ, ఇది రైతులను రక్షించే ప్రభుత్వమా లేక భక్షించే ప్రభుత్వమా అని ఘాటుగా ప్రశ్నించారు. చంద్రబాబు పాలనలో ఆక్వా రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని, ఇది వారి పాలిట శాపంగా పరిణమించిందని ఆమె విమర్శించారు. ఈ మేరకు ఆమె ఓ రైతు ఆక్రోశిస్తున్న ఓ వీడియో పంచుకున్నారు. "కూటమి పాపం.. ఆక్వా రైతన్న పాలిట శాపం. రాష్ట్రంలో ఇంధన సంక్షోభం రొయ్య రైతులకు అంతులేని కష్టం. కంటికి రెప్పలా చూసుకొనే రొయ్య పిల్లలను బ్రతికించేందుకు ఓ పెట్రోల్ బంకు దగ్గర రైతన్న పడిన ఆవేదన వర్ణనాతీతం. రూ. 500 డీజిల్ కోసం ఆ రైతు రోదించిన తీరు చూసి కూటమి ప్రభుత్వం సిగ్గుపడాలి. "అన్నా నాకు ఫ్యాన్ సీట్లు (ఏరేటర్) తిరగాలన్నా .. అప్పుచేసి రొయ్య పిల్ల వేశాను.. ఫ్యాన్ సీట్లు తిరగకపోతే నా రొయ్య పిల్ల చచ్చిపోద్ది అన్న" రైతన్న ఆవేదన వింటుంటే ఈ రాష్ట్రంలో ప్రభుత్వం ఉన్నట్లా? లేనట్లా? చంద్రబాబు గారి ఛాతిలో ఉన్నది గుండెనా? బండనా? ఇది రైతన్నను రక్షించే ప్రభుత్వమా? భక్షించే ప్రభుత్వమా? ఇదేనా చంద్రబాబు గారి విజినరీ? దీన్నే అంటారా అద్భుతమైన గుడ్ గవర్నెన్స్?. రైతులతో కాళ్లు పట్టించుకున్న పాపం ఈ కూటమి ప్రభుత్వానికి తగలకపోదు. ఎక్కడా లేని ఇంధన సంక్షోభం ఏపీలోనే ఎందుకొచ్చింది ? ఎన్డీయే పాలిత రాష్ట్రంలో ఇంధనం కోసం ప్రజల పడిగాపులా? పెట్రోల్ బంకుల దగ్గర మల్లయుద్ధాలా? రేషన్ విధానంలో పెట్రోల్, డీజిల్ పోయడమా? సరిపడేంత ఇంధనం ఉంటే దాదాపు 3 వేల బంకుల్లో నో స్టాక్ బోర్డులు ఇవ్వాల్టికి ఎందుకున్నాయి? ఇదేనా రాష్ట్ర ప్రజలపై కేంద్రానికున్న చిత్తశుద్ధి? ఇందుకేనా పడి పడి మోదీజీకి మద్దతు ఇచ్చేది? బంకుల దగ్గర జనాలు అవస్థలు పడుతుంటే, ప్రత్యక్షంగా అన్నీ రంగాలపై ఇంధన సంక్షోభం తీవ్ర పరిణామాలు చూపిస్తుంటే, ఇంకా బీజేపీ భజన చేయడానికి, మోదీగారి తొత్తుగా ఉండటానికి చంద్రబాబు గారు సిగ్గుపడాలి. రాష్ట్రంపై బీజేపీకి పట్టింపు లేదనడానికి ఇంధన సంక్షోభం ఒక నిదర్శనం. వదంతులు నమ్మొద్దని చెప్పే బదులు... ఇప్పటికైనా కళ్లు తెరవండి చంద్రబాబు గారు" అంటూ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

## ఇరాన్ శాంతి ప్రతిపాదనలకు
# రష్యా మధ్యవర్తిత్వం

(మొదటిపేజీ తరువాయి)

ధ్వజమెత్తింది. ఇదిలావుండగా యుద్ధానికి ముగింపు పలికేందుకు, హోర్ముజ్ జలసంధిని తెరిచేందుకు ఇరాన్ అందజేసిన తాజా శాంతి ప్రతిపాదనలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జాతీయ భద్రతా బృందం సమీక్షిస్తోంది. చర్చలలో తమ అణు కార్యక్రమాన్ని ప్రస్తావించవద్దని, దానిపై తర్వాత చర్చిద్దామని ఇరాన్ సూచించింది. అయితే ఇరాన్ ప్రతిపాదనలపై ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారని, వాటిని ఆయన ఆమోదించబోరని అమెరికా మీడియాలో వార్తలు వచ్చాయి. హోర్ముజ్ జలసంధిని తక్షణమే, ఎలాంటి ఆటంకాలు లేకుండా తెరవాలంటూ పలు దేశాలు కోరుతున్నాయి. బ‌ఎ?రైన్ నేతృత్వంలో ఆయా దేశాలు ఈ మేరకు ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశాయి.

**దిగ్బంధాన్ని తప్పించుకొని హోర్ముజ్‌ను దాటుతున్న నౌకలు**

హోర్ముజ్ జలసంధిని అమెరికా నౌకాదళం దిగ్బంధించినప్పటికీ అనేక చమురు నౌకలు దానిని దాటుకొని ప్రయాణం సాగిస్తున్నాయి. గల్ఫ్ ఆఫ్ ఒమన్‌కు తూర్పు వైపున మోహరించిన అమెరికా దళాలు నౌకల రాకపోకలను నియంత్రిస్తూ, ఆంక్షలను అమలు చేస్తున్నాయి. అయితే ఇరాన్‌కు చెందిన ఖర్గ్ దీవి నుంచి నేరుగా ముంబయికి చేరుకునే మార్గం ఒకటుందని పరిశీలకులు తెలిపారు. ఇటీవలే దేశ్ గరిమ అనే భారత నౌక జలసంధిని దాటింది. జగ్ అర్నవ్, సన్మర్ హెరాల్డ్ నౌకలపై ఇరాన్ సేనలు కాల్పులు జరిపిన రోజే దేశ్ గరిమ నౌక హోర్ముజ్‌ను దాటేసింది. అది గత బుధవారం ముంబయికి చేరుకుంది. ఖతార్‌లోని రాస్ లాఫన్ నుంచి బయలుదేరిన ఈ నౌకలో 97 వేల మెట్రిక్ టన్నుల ముడి చమురు ఉంది. ఒక్క దేశ్ గరిమ మాత్రమే కాదు...ఈ నెల 13న అమెరికా దిగ్బంధం అమలులోకి వచ్చిన రోజు నుంచి ఇప్పటి వరకూ 30కి పైగా నౌకలు హోర్ముజ్‌ను దాటాయి. వివిధ దేశాలకు చెందిన నౌకలు ఇరాన్ నుంచి ముంబయి వైపు వస్తున్నాయని వార్తలు అందుతున్నాయి. అయితే ఈ సమాచారాన్ని భారత్, టెహ్రాన్ అధికారులు ఇంకా ధృవీకరించలేదు. ఇప్పటి వరకూ 34 నౌకలు అమెరికా దిగ్బంధాన్ని దాటుకొని బయటికి వచ్చాయని ఫైనాన్షియల్ టైమ్స్ పత్రిక తెలిపింది. హోర్ముజ్ నుంచి బయటికి వచ్చిన నౌకలు పర్షియన్ గల్ఫ్‌లో ప్రవేశిస్తున్నాయని చెప్పింది. కాగా ప్రస్తుతం హోర్ముజ్‌లో ఇంకా 14 భారత నౌకలు ఉన్నాయని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు.

**హోర్ముజ్‌పై నియంత్రణ ఇరాన్‌దే : ఐరాసలో రష్యా**

హోర్ముజ్ జలసంధిని నియంత్రించే హక్కు ఇరాన్‌కే ఉన్నదని రష్యా స్పష్టం చేసింది. ఐక్యరాజ్యసమితి సమావేశంలో రష్యా రాయబారి వస్సిలీ నెబెంజియా మాట్లాడుతూ భద్రతా కారణాల దృష్ట్యా తన ప్రాదేశిక జలాలలో నౌకల రాకపోకలను నియంత్రించే అధికారం దాడికి గురైన తీర ప్రాంత దేశానికి ఉంటుందని చెప్పారు. ప్రాంతీయ ఉద్రిక్తతలకు ఇరాన్‌పై పూర్తి బాధ్యత మోపేందుకు పశ్చిమ దేశాలు చేస్తున్న ప్రయత్నాలను తప్పుపట్టారు. ఆత్మరక్షణ కోసమే పొరుగు దేశాలపై ఇరాన్ దాడులు చేస్తోందని, అయితే వాటిని సాకుగా చూపి టెహ్రాన్‌పై నిందలు వేస్తున్నారని అన్నారు. పశ్చిమ దేశాలు కపటత్వానికి, ఆధునిక కాలపు సముద్ర దొంగతనానికి పాల్పడుతున్నాయని ఆరోపించారు. నల్ల సముద్రంలో రష్యా వాణిజ్య నౌకలపై ఉక్రెయిన్ జరిపిన దాడులకు ఆ దేశాలు మద్దతు ఇచ్చాయని గుర్తు చేశారు. సంప్రదాయ సముద్ర దొంగలు తమ చట్టవిరుద్ధ చర్యల విషయంలో పారదర్శకంగా వ్యవహరిస్తుంటే ఈ దేశాలు మాత్రం ఏకపక్ష నిర్బంధ చర్యల ముసుగులో వారి దౌష్ట్యాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నాయని అంటూ దీనిని ఓ రకమైన అంతర్జాతీయ సముద్ర దోపిడీగా వస్సిలీ నెబెంజియా అభివర్ణించారు.

**డిజిటల్ ప్రపంచానికీ హోర్ముజ్ కీలకమే**

హోర్ముజ్ జలసంధి కేవలం అంతర్జాతీయ చమురు వాణిజ్యానికే కాదు...డిజిటల్ ప్రపంచానికి కూడా కీలకమైనదే. ఎందుకంటే హోర్ముజ్ జలాలలో ఏర్పాటు చేసిన భూగర్భ ఫైబర్ ఆప్టిక్ కేబుల్స్ భారత్, ఆగేయాసియా దేశాలను గల్ఫ్ దేశాలు, ఈజిప్ట్ ద్వారా యూరప్‌తో అనుసంధానిస్తున్నాయి. డేటా, పవర్ ట్రాన్స్‌మిషన్ కోసం సముద్రంలో ఫైబర్ ఆప్టిక్ లేదా ఎలక్ట్రిక్ కేబుల్స్‌ను ఏర్పాటు చేస్తారు. ప్రపంచ ఇంటర్నెట్ ట్రాఫిక్‌లో 99 శాతం వరకూ వీటి ద్వారానే నడుస్తుంది. కమ్యూనికేషన్స్, విద్యుత్‌కు కూడా ఈ కేబుల్సే ఆధారం. కేబుల్స్‌కు నష్టం జరిగితే ఇంటర్నెట్ నెమ్మదిస్తుంది లేదా నిలిచిపోతుంది. ఈ-కామర్స్‌కు అంతరాయం కలుగుతుంది. ఆర్థిక లావాదేవీలు ఆలస్యమవుతాయి. వీటన్నింటి కారణంగా ఆర్థిక కార్యకలాపాలకు విఘాతం ఏర్పడుతుంది. గల్ఫ్ దేశాలు...ముఖ్యంగా యూఏఈ, సౌదీ అరేబియాలు ఏఐ, డిజిటల్ మౌలిక సదుపాయాలపై అనేక బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తున్నాయి. తద్వారా చమురుపై ఆధారపడడాన్ని తగ్గించుకుంటున్నాయి.

**కోర్టులో అలెన్‌పై ఆరోపణలు**

వైట్‌హౌస్ కరస్పాండెంట్ల విందులో కాల్పులు జరిపిన కోల్ తామస్ అలెన్‌ను మంగళవారం తొలిసారిగా వాషింగ్టన్ డీసీ ఫెడరల్ కోర్టులోని ఓ న్యాయమూర్తి ముందు హాజరు పరిచారు. అతనిపై మూడు ఆరోపణలు మోపారు. దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను హత్య చేసేందుకు అలెన్ ప్రయత్నించాడన్నది వాటిలో తీవ్రమైనది. నేరం రుజువైతే అలెన్‌కు జీవిత ఖైదు శిక్ష పడుతుంది. అతనిపై ఆయుధ నేరాల ఆరోపణ కూడా మోపారు. న్యాయమూర్తి ఎదుట అలెన్ ఎలాంటి వాదనలు వినిపించలేదు. అతనిని గురువారం మరోసారి కోర్టులో ప్రవేశపెడతారు. అలెన్ తన వెంట కత్తులు, తుపాకులు తీసుకొచ్చాడని, దాడికి ముందు కుటుంబ సభ్యులకు ఈ మెయిల్ పంపాడని న్యాయ శాఖ అధికారులు తెలిపారు. అయితే దాడికి నిర్దిష్ట కారణమేమిటో ఇంకా తెలియలేదని చెప్పారు. సంఘటనా స్థలం వద్ద పాటించిన భద్రతా ప్రొటోకాల్స్‌ను కూడా వారు ప్రస్తావించారు. కాగా అధ్యక్షుడి భద్రతలో మార్పులు జరగవచ్చునని వైట్‌హౌస్ తెలిపింది. కాల్పుల ఘటనపై సీక్రెట్ సర్వీస్ స్పందనపై ట్రంప్ సంతృప్తి వ్యక్తం చేశారని చెప్పింది. అయితే అధ్యక్షుడి భద్రతా ప్రొటోకాల్‌లో మార్పులకు సంబంధించి ఈ వారంలో సమావేశం జరుగుతుందని వైట్‌హౌస్ పత్రికా కార్యదర్శి కరోలిన్ లీవిట్ అన్నారు.

**ఐరాసలో అమెరికా, ఇరాన్ మధ్య వాగ్యుద్ధం**

ఐక్యరాజ్యసమితిలో అమెరికా, ఇరాన్ ప్రతినిధుల మధ్య వాగ్యుద్ధం చోటుచేసుకుంది. 1970వ దశకంలో అమలులోకి వచ్చిన అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందంపై సోమవారం 11వ సమీక్షా సమావేశం ప్రారంభమైంది. నెల రోజుల పాటు జరిగే ఈ సమావేశ నిర్వహణకు 34 మంది ఉపాధ్యక్షులను ఎంపిక చేయగా అందులో ఇరాన్ కూడా ఉంది. అలీన దేశాలు ఇరాన్‌ను ఆ పదవికి ఎంపిక చేశాయి.

అయితే ఇరాన్‌ను ఉపాధ్యక్ష పదవికి ఎంపిక చేయడాన్ని అమెరికా తీవ్రంగా వ్యతిరేకించింది. ఇది ఒప్పందాన్ని అవమానపరచడమేనని అమెరికా సీని యర్ అధికారి క్రిస్టోఫర్ విమర్శించారు. ఒప్పందానికి ఇరాన్ చాలా కాలంగా కట్టుబడి ఉండడం లేదని, తన అణు కార్యకలాపాలపై అంతర్జాతీయ అణు ఇంధన సంస్థకు సహకరించేందుకు నిరాకరిస్తోందని ఆరో పించారు. అయితే ఈ ఆరోపణలను ఇరాన్ ప్రతినిధి రెజా నజాఫీ తోసిపుచ్చారు. అవి నిరాధారమైనవని, రాజ కీయ దురుద్దేశంతో కూడినవని అన్నారు. వాషింగ్టన్ అణుచరిత్రను, దాని ఆయుధ నిల్వల విస్తరణను ఎత్తిచూపారు.

## శుక్రాచార్యుడు ఫాంహౌస్‌లో పడుకున్నాడు..
## మారీచుడు, సుబాహుడు
# జనంలో తిరుగుతున్నారు

(మొదటిపేజీ తరువాయి)

శంకుస్థాపన కార్యక్రమంలో స్పష్టం చేశారు. ఈ నగరం భావితరాలకు వరంగా మారుతుందని పేర్కొన్నారు. అయితే, ఫ్యూచర్ సిటీ నిర్మాణం అంత సులభం కాదని వివరించారు. ఈ సందర్భంగా విపక్ష నేతలపై తనదైన శైలిలో సెటైర్లు వేశారు. కొంత మంది ఫ్యూచర్ సిటీ నిర్మాణం విషయంలో తనను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుంటున్నారని రేవంత్ అన్నారు. "మీరు ఏడుస్తూనే ఉండండి.. నేను చేసుకుంటూ పోతూనే ఉంటా" అంటూ తనదైన శైలిలో ప్రతిపక్షాలకు చురకలు అంటించారు. శుక్రాచార్యుడు ఫాంహౌస్ లో పడుకున్నాడని, మారీచుడు, సుబాహుడు జనంలో తిరుగుతున్నారంటూ బీఆర్ఎస్ అగ్రనేతలను ఉద్దేశించి అన్నారు. టోక్యో, సియోల్, సింగపూర్ వంటి ప్రపంచ స్థాయి నగరాలతో పోటీ పడేలా ఫ్యూచర్ సిటీని నిర్మించడమే తమ లక్ష్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆ దిశగా రోడ్లు సహా అన్ని మౌలిక సదుపాయాలను వేగంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా జూన్ 2లోపు ఫ్యూచర్ సిటీ భవన నిర్మాణాన్ని పూర్తిచేస్తామని తెలిపారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు రాష్ట్రానికే తలమానికం అని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. కోవిడ్ వ్యాక్సిన్ తయారీలో హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీ సేవలు ప్రపంచవ్యాప్తంగా అందాయని తెలిపారు. ఐటీ, డిఫెన్స్, ఫార్మా ఎగుమతుల్లో నగరం చాలా అభివృద్ధి చెందిందన్నారు. రానున్న రోజుల్లో భాగ్యనగరానికి మరిన్ని పెట్టుబడులు రానున్నాయని వెల్లడించారు. ఫ్యూచర్ సిటీ కోసం రైతులు భూములిచ్చి సహకరించాలని రేవంత్ విజ్ఞప్తి చేశారు. అందరికీ కచ్చితంగా పరిహారం అందిస్తామన్నారు. అధికారులు వారికి వివరించి నచ్చజెప్పాలన్నారు. అప్పుడే ప్రపంచస్థాయి నగరానికి పునాదులు పడతాయని పేర్కొన్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పూర్తయితే హైదరాబాద్ నుంచి బెంగళూరుకు 70-80 కి.మీ దూరం తగ్గుతుందన్నారు. కేంద్రం తీసుకురానున్న ఏడు హైస్పీడ్ రైళ్లలో మూడు రాష్ట్రం నుంచి వెళుతున్నాయని సీఎం తెలిపారు. బెంగళూరు నుంచి హైదరాబాద్, శంషాబాద్ నుంచి ముంబై, శంషాబాద్ నుంచి చెన్నై వరకు బుల్లెట్ ట్రైన్లు రాబోతున్నాయని పేర్కొన్నారు.

# బీజేపీలో ఆప్ ఎంపీల విలీనం

(మొదటిపేజీ తరువాయి)

ఆప్ ఎంపీలు రాసిన లేఖ రాజ్యాంగంలోని పదో షెడ్యూల్డ్‌కు తగినట్టు ఉందని రాజ్యసభ్య చైర్మెన్ భావిస్తున్నట్టు తెలిసింది. ఆ షెడ్యూల్డ్ ప్రకారం 2/3 మెజారిటీ ఉంటే, విలీనాన్ని ఆమోదించవచ్చు. కాగా, తమ పార్టీ నుంచి బీజేపీలోకి ఫిరాయించిన ఏడుగురు రాజ్యసభ ఎంపీలను సస్పెండ్ చేయాలని కోరుతూ రాజ్యసభ చైర్మెన్‌కు ఆప్ ఆదివారం వినతిపత్రం సమర్పించింది. కేంద్ర సంస్థలను ఉపయోగించి తమ నాయకులను ఒత్తిడి చేసి బీజేపీలోకి చేర్చుకున్నారని ఆరోపించింది. ఈ అంశంపై చట్టపరమైన పోరాటం కూడా కొనసాగుతుందని తెలిపింది.

# విశాఖలో
# గూగుల్ ఏఐ హబ్..

విశాఖ- సూర్య వాస్తవం

ఏపీలో టెక్నాలజీ రంగంలో మరో భారీ పెట్టుబడికి అడుగుపడింది. విశాఖపట్నంలో గూగుల్ ఏర్పాటు చేయనున్న క్లౌడ్ ఏఐ హబ్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర ఐటీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మంగళవారం శంకుస్థాపన చేశారు. అదానీ కనెక్స్, ఎయిర్‌టెల్ నెక్స్‌ట్రా భాగస్వామ్యంతో గూగుల్ సుమారు 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడితో ఈ ప్రాజెక్టును చేపడుతోంది. విశాఖ జిల్లా తర్లువాడలో 1 గిగావాట్ సామర్థ్యంతో ఈ హైపర్ స్కేల్ ఏఐ డేటా సెంటర్‌ను నిర్మించనున్నారు. ఈ మెగా ప్రాజెక్ట్ కోసం తర్లువాడ, రాంబిల్లి, అడవివరం ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వం మొత్తం 600 ఎకరాల భూమిని కేటాయించింది. ఈ శంకుస్థాపన కార్యక్రమానికి ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గూగుల్ ఎక్స్‌పీరియన్స్ జోన్‌ను సందర్శించి అక్కడి టెక్నాలజీలను పరిశీలించారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా ఇంఛార్జి మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి, ఎంపీ భరత్ పాల్గొన్నారు. గూగుల్ గ్లోబల్ ఇన్ఫ్రా వైస్ ప్రెసిడెంట్ బికాస్ కోలే, భారతీ ఎంటర్‌ప్రైజెస్ వైస్ చైర్మన్ రాకేష్ మిట్టల్, అదానీ గ్రూప్ ప్రతినిధి జీత్ అదానీ, హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్ జనరల్ లారా విలియమ్స్, గూగుల్ ఇండియా ప్రతినిధి ప్రీతి లొబానా తదితరులు హాజరయ్యారు. ఈ ప్రాజెక్టుతో విశాఖ నగరం గ్లోబల్ టెక్నాలజీ మ్యాప్‌లో కీలక స్థానం సంపాదించనుంది.

# నేడు పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికలు

(మొదటిపేజీ తరువాయి)

విస్తృతమైన భద్రతా ఏర్పాట్లను చేపట్టింది. ఏడు జిల్లాల్లో కలిపి 2,321 కంపెనీల కేంద్ర బలగాలను మోహరించి ంది. కోల్‌కతాలో బలగాల మోహరింపు అధికంగా ఉంది. ఇక్కడ 273 కంపెనీల బలగాలు మోహరించాయి. మొత్తం 142 మంది సాధారణ పరిశీలకులు, 95 మంది పోలీసు పరిశీలకులు, 100 మంది వ్యయ పరిశీలకులను నియమించారు.

**ఓటర్ల పరంగా చూస్తే..** రెండో విడతలో భాగంగా మొత్తం 3.21 కోట్ల మంది ఓటర్లలో.. 1.64 కోట్ల మంది పురుషులు, 1.57 కోట్ల మంది స్త్రీలు, 792 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నారు. భౌగోళిక విస్తీర్ణం పరంగా ఎన్నికలకు వెళ్తున్న నియోజకవర్గాల్లో అత్యంత చిన్నది కోల్‌కతాలోని జోరాసంకో కాగా, అత్యంత పెద్దది నదియాలోని కళ్యాణి. ఓటర్ల సంఖ్య పరంగా అత్యంత చిన్న నియోజకవర్గం భాట్‌పారా (1,17,195 మంది ఓటర్లు) కాగా, అత్యంత పెద్దది చుంచురా (2,75,715 మంది ఓటర్లు). రెండవ దశలో ఎన్నికలకు వెళ్తున్న 142 స్థానాలు ఏడు జిల్లాల్లో విస్తరించి ఉన్నాయి. ఇందులో ఉత్తర 24 పరగణాలు (33 స్థానాలు), దక్షిణ 24 పరగణాలు (31), నదియా (17), హౌరా (16) కోల్‌కతా (11), హుగ్లీ (18), పుర్బా బర్ధమాన్ (16)లు ఉన్నాయి.

# సంపాదకీయం

## బంగారం ఆస్తే...



బంగారం కొనుగోలు విషయంలో భారతీయుల ట్రెండ్ మారుతోంది. ఒకప్పుడు బంగారం అంటే అలంకరణ సాధనంగానే చూసేవారు, నగలనే అధికంగా కొనుగోలు చేసేవారు. అయితే, పసిడి ధరలు రికార్డ్ గరిష్ఠాలకు చేరిన క్రమంలో బంగారాన్ని పెట్టుబడిగా పరిగణిస్తున్నారు. బంగారంలో పెట్టుబడి పెడితే అధిక లాభం పొందొచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం దేశీయంగా బంగారం, వెండి ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. గతంలో పరుగులు పెట్టిన రెండు లోహాల ధరలు.. ఇప్పుడు క్రమంగా దిగి వస్తున్నాయి. ధరలు తగ్గడం మహిళలకు కొంత ఉపశమనం కలిగించినట్లే. అయితే దేశీయ మార్కెట్లో గత మూడు రోజులుగా బంగారం, వెండి ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. ఏప్రిల్ 28న కూడా స్వల్పంగా తగ్గాయి. గత వారం రోజులుగా భారీగా తగ్గిన ధరలు ఒక్కసారి మాత్రమే పెరిగాయి. అంటే ఇదే మంచి అవకాశంగా చెప్పవచ్చు. అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు పెరగడం, క్రూడ్ ఆయిల్ ధరలు రికార్డ్ స్థాయిలోనే ఉండడం వంటివి బంగారం ధరలు తగ్గేందుకు కారణమవుతున్నట్లు బులియన్ మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ నెలలో 24న బంగారం ధరలు కాస్త పెరిగినట్లు కనిపించినా రికార్డ్ గరిష్ఠాలకు చాలా దూరంగానే ఉన్నాయి2025లో బంగారాన్ని పెట్టుబడుల కోసం కొనుగోలు చేయడం 40 శాతానికి చేరినట్లు ఓ నివేదిక వెల్లడించింది. ముందు ముందు ఇది మరింత పెరగవచ్చు నివేదిక తెలిపింది.అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులతో బంగారం ధరలు రికార్డ్ స్థాయికి చేరుకున్నాయి. ఏడాది కాలంలోనే ఊహించని విధంగా పెరిగాయి. ఈ క్రమంలో భారతీయులు బంగారం కొనుగోలు చేసే దృక్పథం మార్చుకుంటున్నారని ప్రముఖ రేటింగ్స్ ఏజెన్సీ కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ నివేదిక వెల్లడించింది. భారత్‌లో గత ఏడాది 2025లో బంగారాన్ని పెట్టుబడుల కోసం కొనుగోలు చేయడం 40 శాతానికి ఎగబాకినట్లు తెలిపింది. అంతకు ముందు ఏడాది వరకు అది 30 శాతానికి లోపే ఉండాదని, మిగితా 70 శాతం పైన అలంకరణ కోసం బంగారు ఆభరణాలు మాత్రమే కొనుగోలు చేసే వారని పేర్కొంది. అయితే, ధరలు పెరుగుతుండడం వంటి కారణాలతో నగలకు బదులుగా ఆస్తులకు ప్రాధాన్యత ఇస్తూ పెట్టుబడులు పెడుతున్నారని పేర్కొంది.గత ఏడాదిలో పెట్టుబడుల కోసం మేలిమి బంగారం కొనుగోళ్లు, డిజిటల్ విధానంలో కొనుగోళ్లు అనేవి ఎక్కువగా జరిగాయని కేర్ ఎడ్జ్ నివేదిక పేర్కొంది. బంగారం ఈటీఎఫ్‌ల ద్వారానే ఏకంగా 37.5 టన్నుల బంగారానికి సమానమైన పెట్టుబడులు వచ్చినట్లు తెలిపింది. గత 10 సంవత్సరాల కాలంలో వచ్చిన మొత్తం పెట్టుబడుల కంటే ఇది ఎక్కువగా ఉండడం గమనార్హం. 2026-27 ఆర్థిక సంవత్సరం లోనూ మొత్తం బంగారం వినియోగంలో పెట్టుబడుల విలువ 35-40 శాతం వరకు ఉండవచ్చని అంచనా వేసింది. 2026లోనూ బంగారం ధరలు గరిష్ఠ స్థాయుల్లోనే కొనసాగుతాయని కేర్ ఎడ్జ్ డైరెక్టర్ అఖిల్ గోయల్ అంచనా వేశారు.గత ఏడాది 2025లో నగల గిరాకీ, విలువ పరంగా వార్షికంగా 10 శాతం మేర పెరిగి రూ.4.8 లక్షల కోట్లకు చేరుకున్నట్లు తెలిపింది. అధిక ధరల కారణంగా వినియోగదారులు తేలికైన, తక్కువ క్యారెట్ల ఆభరణాలకు మొగ్గు చూపుతున్నారని, అలాగే ఈ లోహాల అమ్మకాల పరిమాణ 15 శాతం మేర పడిపోయినట్లు నివేదిక వెల్లడించింది. 2025-26 ఆర్థిక ఏడాదిలో ఆభరణాల పెద్ద వ్యాపారులు 35 శాతం ఆదాయ వృద్ధిని నమోదు చేయగా 2026-27 ఆర్థిక సంవత్సరంలో అది 20-25 శాతానికి తగ్గవచ్చని అంచనా వేసిందిఈ ట్రెండ్ భారత్‌కు మాత్రమే పరిమితం కాలేదని, ప్రపంచ వ్యాప్తంగా ప్రజల ధోరణి మారుతోందని కేర్ ఎడ్జ్ రేటింగ్స్ తెలిపింది. 2025లో బంగారం పెట్టుబడుల డిమాండ్ 2175 మెట్రిక్ టన్నులకు చేరిందని, అది అంతకు ముందు 2020లోని 1805 టన్నులను మించినట్లు తెలిపింది. ఇందులో ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ వాటానే ఎక్కువగా ఉందని తెలిపింది. అలాగే బంగారు కడ్డీలు, నాణెల కొనుగోలు సైతం పెరిగిందని, అది 12 ఏళ్ల గరిష్ఠ స్థాయికి చేరుకుందని తెలిపింది. భారత్‌లోనూ గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి పెట్టుబడులు భారీగా వస్తున్నట్లు నివేదిక తెలిపింది. 2025 ఒక్క ఏడాదిలోనే 37.5 టన్నులకు సరిపడా పెట్టుబడులు వచ్చాని పేర్కొంది.అహ్మదాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఇండియా గోల్డ్ పాలసీ సెంటర్ హెడ్ ప్రొఫెసర్ సుందరవల్లి నారాయణస్వామి అంచనాల ప్రకారం ఆర్బీఐ వద్ద సుమారు 800-820 టన్నుల బంగారం ఉంది. అలాగే దేశంలో ఆర్థికంగా వెలికితీయగల బంగారం సుమారు 70-80 టన్నులు మాత్రమే" అని ఆయన చెప్పారు.ఆర్థికంగా వెలికితీయగల బంగారం అంటే ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానంతో లాభదాయకంగా తవ్వి తీసుకోగల బంగారం అని అర్థం.భారత్‌లో మంచి నాణ్యత గల బంగారం తక్కువగా ఉంది, కాబట్టి ఇక్కడ మైనింగ్ పోటాపోటీగా ఏమీ జరగదు" అని ప్రొఫెసర్ సుందరవల్లి అంటున్నారు."భారతీయుల దగ్గర చాలా బంగారం ఉంది. ఎంత బంగారం ఉందనే విషయంపై భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ అది సాధారణంగా 25 వేల నుంచి 27 వేల టన్నుల వరకు ఉంటుందని భావిస్తున్నారు" అని ఆయన అన్నారు.ఈ అంకెకు ఆధారం ఏంటని అడగ్గా, ఇది చాలా మంది నమ్మే ఒక సాధారణ అంచనా మాత్రమే అని ఆయన అన్నారు."ప్రతిఏటా 600 నుంచి 700 టన్నుల బంగారం దిగుమతి అవుతుండగా, ఎగుమతి చాలా తక్కువ. అందుకే ఈ బంగారం ఇళ్లలో ఉండిపోయింది" అని ఆయన చెప్పారు.భారత్ వద్ద 2026 ఫిబ్రవరి నాటికి అధికారికంగా సుమారు 880 టన్నుల బంగారం ఉన్నట్టు వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ పేర్కొంది.ఈ విషయంలో భారత్ ప్రపంచంలో 9వ స్థానంలో ఉంది. దీనికంటే ముందు అమెరికా, జర్మనీ, అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్), ఇటలీ, ఫ్రాన్స్, రష్యా, చైనా, స్విట్జర్లాండ్ ఉన్నాయి.అయితే అధికారిక నిల్వలు భారతదేశపు బంగారు కథలో ఒక భాగం మాత్రమే."మన దగ్గర సుమారు 50 కోట్ల టన్నుల పసిడి ధాతువు (అంటే బంగారం కలిగిన రాయి/మట్టి) ఉంది, కానీ ఉత్పత్తి చాలా తక్కువగా ఉంది" అని థరూర్ తన వ్యాసంలో రాశారు.దేశంలో మొత్తం 518.23 మిలియన్ టన్నుల పసిడి ధాతువు ఉన్నట్టు నేషనల్ మినరల్ ఇన్వెంటరీ చెబుతోంది.అయితే దీనర్థం ఈ పసిడిధాతువునంతటినీ వెలికి తీయడం తేలికైన పని అని కాదు. ఇందులో 494.50 మిలియన్ టన్నుల బంగారం వెలికితీయడం కష్టమైనది కాగా, 23.72 మిలియన్ టన్నులను మాత్రం రిజర్వ్‌గా పరిగణిస్తారు.రిజర్వ్ అంటే బంగారాన్ని వెలికితీయడం లాభదాయకంగానూ, సులభంగా సాధ్యమయ్యే స్థితి.

# నారా లోకేశ్‌కు పెద్ద సవాల్



**గుంటూరు-సూర్య వాస్తవం:**తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి నారా లోకేశ్ కు పెద్ద సవాల్ అని చెప్పాలి. ఇప్పటి వరకూ చంద్రబాబు ఇమేజ్ పైనే పార్టీ ఇన్నాళ్లు గెలుస్తూ వచ్చింది. నాలుగు సార్లు అధికారంలోకి వచ్చింది. అయితే రానున్న కాలంలో లోకేశ్ నాయకత్వంలోనే ఎన్నికలకు వెళ్లనున్నారన్నది అందరికీ తెలిసిన విషయమే. టీడీపీ ఇప్పటికే లోకేశ్ చేతుల్లోకి వెళ్లిపోయింది. 2029 ఎన్నికలు లోకేశ్ నాయకత్వంలోనే జరగనున్నాయి. అభ్యర్థుల ఎంపిక నుంచి మ్యానిఫేస్టో రూపకల్పన వరకూ ఆయనే అన్నింటికీ పర్యవేక్షణ వహిస్తారు. లోకేశ్ పార్టీ క్యాడర్ విశ్వాసాన్ని బలంగా పొందగలిగారు.అయితే ప్రజల నమ్మకాన్ని పొందాల్సి ఉంటుంది. చంద్రబాబు ఇమేజ్ తో, అనుభవంతో పోల్చుకుంటే లోకేశ్ కు ఇప్పట్లో సాధ్యం కాదు. ఒకరకంగా లోకేశ్ విపక్ష నాయకుడు జగన్ కంటే తక్కువ రాజకీయ అనుభవం ఉన్న వారి కిందే జనం చూస్తారు. పార్టీని నడపగలగడం అంత ఆషామాషీ కాదు. గెలిస్తే పూలదండలు..ఓడితే అవే చేతులు రాళ్లు వేస్తాయన్నది లోకేశ్ మర్చి పోకూడదు. చంద్రబాబు నాయుడు పార్టీ పగ్గాలు చేపట్టే నాటికీ, లోకేష్ బాధ్యతలు స్వీకరిస్తున్న సమయానికి చాలా తేడా ఉంది. ఒకరకంగా చెప్పాలంటే సంబంధమే లేదు. చంద్రబాబు గద్దెనెక్కే సమయంలో కూడా ఎన్టీఆర్‌ను బలవంతంగానే గద్దె దించవలసి వచ్చింది. శాసనసభ్యులు తీసుకున్న ఆ నిర్ణయాన్ని పార్టీ శ్రేణులు ఆహ్వానించటం చంద్రబాబు సాధించిన విజయాల్లోకే ఘనవిజయం. పార్టీ శ్రేణులు కూడా చంద్రబాబును ఆహ్వానించి నాయకత్వ మార్పిడిని, బాబు నాయకత్వాన్ని ఆమోదించాయి. ప్రస్తుతం లోకేశ్ నాయకత్వ బాధ్యతలను స్వీకరించే సమయానికి చంద్రబాబు పూర్తిగా ఫిట్ గా, ఆరోగ్యంగా ఉన్నారు. పవన్ కల్యాణ్ కూడా మరో పదిహేనేళ్ల అనుభవమున్న చంద్రబాబు నాయకత్వమే రాష్ట్రానికి అవసరమని పదేపదే చెబుతున్నారు. మరొకవైపు జగన్ పాలనలోని లోపాలు కలసి వస్తాయని భావించినా అవి ఎంత వరకూ అనేది ఇప్పుడే చెప్పలేం. అటువంటి పరిస్థితుల్లో టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంటుగా బాధ్యతలు స్వీకరిస్తున్నాడు లోకేశ్. బాధ్యతను తీసుకుంటున్న సమయానికి చుట్టూ ఎటు చూసినా ఆహ్లాదంగానే కనిపిస్తున్నది. ?కానీ ఇప్పుడు నడుస్తున్నది చాలా సంక్లిష్ట రాజకీయం. దీనిని లోకేశ్ ఎలా అధిగమిస్తారోనన్నది చూడాలి. నారా లోకేష్ విశాఖ విమానాశ్రయంలో ప్రత్యక్షం అయ్యారు. చింతకాయల విజయ్ ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు భారీగా తరలి వచ్చాయి విమానాశ్రయానికి. పెద్ద ఎత్తున స్వాగతం పలికాయి. అసలు లోకేష్ ఎక్కడికి వెళ్లారు. అనే చిక్కుముడి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వీడలేదు. లోకేష్ వెళ్ళింది వ్యక్తిగత పర్యటన నిమిత్తం. దానిని కూడా తట్టుకోలేకపోతోంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. ఈ గోప్యత వెనుక ఉన్న కారణం ఏంటి అనేది ఆ పార్టీకి అంతుపట్టడం లేదు. దీనికి తోడు విశాఖ విమానాశ్రయంలో లోకేష్ స్వాగతం చూస్తుంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మైండ్ బ్లాక్ అవుతోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఈ రకమైన ఆందోళన కోసమే లోకేష్ పర్యటనను గోప్యంగా ఉంచినట్లు అర్థం అవుతోంది. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన జరగనుంది. లోకేష్ ప్రత్యేక చొరవతోనే ఈ డేటా సెంటర్ విశాఖకు వచ్చింది. కేంద్ర ప్రభుత్వంతో ఎప్పటికప్పుడు ప్రత్యుత్తరాలు జరుపుతూ.. పట్టు గూగుల్ సంస్థతో ప్రభుత్వం తరుపున చర్చిస్తూ.. ఒప్పించడంలో లోకేష్ పాత్ర ఉంది. ఈనెల 18 నుంచి కనిపించకుండా పోయిన లోకేష్ ఈరోజు విశాఖ ఎయిర్పోర్ట్లో ప్రత్యక్షం అయ్యారు. జాబ్ క్రియేటర్ ఆఫ్ చీఫ్ అంటూ పెద్ద ఎత్తున ప్లకార్డులు ప్రదర్శిస్తూ.. లోకేష్ కు స్వాగతం పలకడం విశేషం. అసలు ఏం జరుగుతుందో వైసీపీకి అర్థం కాని పరిస్థితి.

# ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి

**- ఎస్పీ జగదీష్ తో కలిసి రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**




**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ఆయా శాఖ అధికారులు సమన్వయంతో పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఆదేశించారు.మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా ఎస్పీ జగదీష్ తో కలిసి రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై సమీక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్, రవాణాఆర్ అండ్ బి ట్రాఫిక్ పోలీసు, నేషనల్ హైవే పంచాయతీ రాజ్ ఆర్టీసీ వైద్య ఆరోగ్యశాఖ లు సమన్వయంతో ప్రమాదాలు జరిగే ప్రాంతాలను ముందస్తుగా గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా నగరంలో రహదారుల్లో రోడ్ల డ్రైనేజీ మరమ్మత్తుల సమయంలో వాహనదారులు గుర్తించేలా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ఖాళీ స్థలాలను గుర్తించి పార్కింగ్ ప్రదేశాలుగా ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అలాగే పార్కింగ్ చేసుకునే విధంగా కొరకు పబ్లిక్ టెండర్ చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ప్రమాదాల్లో బాధితులకు తక్షణ వైద్య సాయం అందించేలా అన్ని ఆసుపత్రులకు ఆదేశాలు జారీ చేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఫుట్ పాత్, సిగ్నల్ మరియు జన కూడల్లో లైటింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మరి ముఖ్యంగా రోడ్డు ప్రమాద బాధితులకు సంబంధించి ప్రధానమంత్రి రోడ్డు ప్రమాద బాధితుల చికిత్స (పీఎం రాహత్) పథకం పై విస్తృతంగా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు . గాయపడిన వారికి రూ.1.5 లక్షల వరకు అందించడం జరుగుతుందన్నారు. పోలీసు రవాణా, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు బాధితుల కుటుంబాల అనుమానాలను నివృత్తి చేసి పథకాన్ని సద్వినియోగం చేసుకునే చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ సంయుక్తంగా ప్రధానమంత్రి రాహత్ పథకం గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో తాడిపత్రి ఏఎస్పి రోహిత్ చౌదరి, అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్ కుమార్,రవాణా శాఖ అధికారి వీర్రాజు, డి ఎం హెచ్ ఓ శ్రీనివాసులు, డా.ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ కోఆర్డినేటర్ డా. గంగాధర్ రెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం శ్రీలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ జస్వంత్, టెక్నికల్ మేనేజర్ సోమ్లా నాయక్ వివిధ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అవసరం మేరకు మాత్రమే

# పెట్రోలు, డీజిల్ కొనుగోలు చేయండి

- జిల్లాలో పెట్రోల్, డీజల్ కు ఎలాంటి ఇబ్బంది లేదు..
- తప్పుడు సమాచారాలు ప్రచారం చేస్తూ ప్రజల్లో అలజడులు సృష్టిస్తే చర్యలు తీసుకుంటాం
- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ , జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** అనంతపురం నగరంలోని పెట్రోల్ బంక్ లను జిల్లా కలెక్టర్ , జిల్లా ఎస్పీలు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. పెట్రోల్ బంకుల్లోని నిల్వలు, విక్రయాలపై ఆరా తీశారు ... వాహన చోదకులతో ముఖా ముఖి మాట్లాడి వాస్తవ పరిస్థితులను తెలుసుకున్నరు. అనంతపురం నగరంలోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న సంగమేష్ సర్కిల్‌లో ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ , జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఈ సందర్భంగా విని యోగదారులతో మాట్లాదరు పెట్రోల్ దొరుకుతుందా అంటూ ఆరా తీశారు.... నిన్నటి నుండి ఎలాంటి ఇబ్బంది లేకుండా దొరుకుతోంది అని తెలుపగా అవసరం మేరకు మాత్రమే పెట్రోలు, డీజిల్ కొనుగోలు చేయాలని, నిల్వ చేసుకునేలా చేయరాదని కలెక్టర్, ఎస్పీలు సూచించారు.



ప్రస్తుతం జిల్లాలో పెట్రోల్, డీజల్ కు ఎలాంటి ఇబ్బంది లేదు.. నిన్న కూడా స్టాక్ వచ్చిందని, 24 గంటల నుంచి అదనంగా జిల్లాలో పెట్రోల్, డీజల్ స్టాక్ వస్తోంది.. ఈరోజు 42 లోడ్లు సాయంత్రంలోపు వచ్చేస్తాయి.. ఎక్కడా పెద్దగా సమస్య లేదని జిల్లా కలెక్టర్ తెలిపారు. తప్పుడు సమాచారాలు ప్రచారం చేస్తూ ప్రజల్లో అలజడులు సృష్టిస్తే చర్యలు తప్పవని ఎస్పీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ , ఎస్పీలతో పాటు అసిస్టెంట్ కలెక్టర్ సుయాశ్ కుమార్, డిఎస్ఓ వెంకటేశ్వర్లు, తదితరులు వెళ్లారు.

# జిల్లా అభివృద్ధిలో ఇంజనీరింగ్ శాఖల పాత్ర కీలకం

- సమన్వయంతో వేగవంతంగా పనులు పూర్తి చేస్తే ప్రజలకు ప్రయోజనం
- గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశాలు
- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం:** మంగళవారం మదనపల్లి కలెక్టరేట్ కోర్టు హాలులో... జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఇంజనీరింగ్ శాఖల అధికారులతో సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల వారీగా చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని సమగ్రంగా సమీక్షించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు.

శాఖల వారి సమీక్ష

జిల్లాలో ఏపీఎస్పీడిసిఎల్ పరిధిలో పీఎం సూర్యఘర్ పథకం కింద 56,996 గృహాలను లక్ష్యంగా తీసుకుని 12,237 కనెక్షన్లకు ఆమోదం లభించిందన్నారు. ఇప్పటివరకు 10,992 గృహాల్లో సర్వే పూర్తై, 8,857 గృహాలు అనుకూలంగా గుర్తించగా, 208 యూనిట్లు ఇన్‌స్టాల్ చేసి 182 యూనిట్లు సింక్రనైజ్ చేశారన్నారు. పీఎం కుసుమ్ పథకం కింద 19 మెగావాట్ సామర్థ్యంతో సోలార్ ప్రాజెక్ట్ మంజూరై, దాన్ని 30 మెగావాట్లకు విస్తరించే ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు వివరించారు. వ్యవసాయ విద్యుత్ అవసరాలు కూడా పెరుగుతున్న నేపథ్యంలో సరఫరా మెరుగుపరచాలని కలెక్టర్ ఆదేశించారు.

రోడ్లు ఑ భవనాల శాఖ పరిధిలో 65 పనులు కొనసాగుతుండగా, వాటిలో కొన్ని పూర్తయ్యాయి, మరికొన్ని పురోగతిలో ఉండగా, ఇంకొన్ని టెండర్ దశలో ఉన్నాయి. భూసేకరణ, యుటిలిటీ షిఫ్టింగ్ కారణంగా కొన్ని పనులు ఆలస్యమవుతున్నట్లు అధికారులు తెలిపారు. అదే విధంగా నేషనల్ హైవే పనులలో కూడా భూసేకరణ, అనుమతుల సమస్యలు ఎదురవుతున్నాయని వెల్లడించారు. రాష్ట్ర, జాతీయ రహదారులు జిల్లా అభివృద్ధికి కీలకమని, పనులు త్వరగా పూర్తైతే రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ నేపథ్యంలో పనులను వేగవంతం చేసి గడువులోపు పూర్తి చేయాలని, అన్ని అవరోధాలను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇరిగేషన్ శాఖ పరిధిలో చెరువులు, కాలువల అభివృద్ధి పనులు కొనసాగుతుండగా, కొన్ని పనులు భూసేకరణ, సాంకేతిక కారణాల వల్ల ఆలస్యమవుతున్నట్లు దృష్టికి వచ్చిందన్నారు. చీ=జు+గా కింద పల్లె పండుగ--1లో చేపట్టిన 1084 పనుల్లో 93% ప్రగతితో 1013 పనులు పూర్తి కాగా, కేవలం 24 పనులు ప్రారంభం కాలేదన్నారు. ఇందుకు గల కారణాలను విశ్లేషించుకుని సమస్యలను పరిష్కరించుకొని వాటిని కూడా వెంటనే ప్రారంభించాలని సూచించారు. ఈ నేపథ్యంలో అన్ని పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ఇరిగేషన్ శాఖ పరిధిలో 78,181 ఎకరాల ఆయకట్టుతో 14.692 ుఏజ నిల్వ సామర్థ్యం కలిగిన నీటి వనరులు ఉన్నాయన్నారు. జిల్లాలో 3,767 చెరువుల్లో 397 పూర్తిగా నిండగా, మరికొన్ని వివిధ స్థాయిల్లో నీటితో ఉన్నట్లు నివేదికలలో ఉందన్నారు. ట్రిపుల్ ఆర్ కింద 161 పనులు రూ.11,116 లక్షల వ్యయంతో చేపట్టగా, ూడవీ కింద 118 పనుల్లో 85 పూర్తయ్యాయి. ఎచీూా ఫేజ్-఑఑ పనులు, పుంగనూరు బ్రాంచ్ కాలువ లైనింగ్ వంటి ప్రధాన ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. పనులను వేగవంతం చేసి రైతులకు సమయానికి సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ పరిధిలో మొత్తం 3062 పనులు చేపట్టగా, అందులో 2000 పనులు పూర్తయ్యాయి, 560 పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. మిగిలిన వాటిని కూడా నిర్దేశిత కాల పరిమితి లోగా పూర్తి చేయాలన్నారు. గ్రామీణ రోడ్లలో మొత్తం 4412 కి.మీ. పొడవులో, గణనీయమైన భాగం మోటరబుల్ స్థితిలో ఉండగా, మరికొన్ని రోడ్లు మరమ్మతులు, పునర్నిర్మాణం అవసరమని గుర్తించినట్లు అధికారులు వివరించారు. గ్రామీణ తాగునీటి సరఫరా, పైప్‌లైన్ నెట్‌వర్క్, ఓహెచ్ఎస్ఆర్ (గాసూ=), సమ్మర్ కంటింజెన్సీ పనుల పురోగతిని సమీక్షించారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్ కింద ట్యాంకర్ సరఫరా, బోర్‌వెల్స్ మరమ్మతులు, పైప్‌లైన్ పనులు కొనసాగుతున్నాయి. జల్జీవన్ మిషన్ వాటర్ గ్రిడ్డు పనులను వేగవంతం చేసి ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ప్రతి శాఖ లక్ష్యాలు, సాధించిన ప్రగతి, మిగిలిన పనులు, గడువులు, పెండింగ్ కారణాలు, టెండర్ మరియు భూసేకరణ సమస్యలపై విపులంగా చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... పనుల ఆలస్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. ప్రతి శాఖ స్పష్టమైన యాక్షన్ ప్లాన్ రూపొందించి, పెండింగ్ పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభం లోపల చేపట్టిన భవనాలు, రహదారులు, ఇతర నిర్మాణ పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. పనుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, అవసరమైతే ఉన్నతస్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. జిల్లా అభివృద్ధికి ఇంజనీరింగ్ శాఖలు కీలకమని, సమన్వయంతో పనిచేస్తే ప్రజలకు త్వరగా ప్రయోజనం చేకూరుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆయా ఇంజనీరింగ్ శాఖల జిల్లా అధికారులు, వారి సిబ్బంది పాల్గొన్నారు.

# అపోహలు నమ్మవద్దు

## - పెట్రోల్, డీజిల్ కొరత లేదు: తహశీల్దార్ భోగన్న గౌడ్



**ఉరవకొండ - సూర్య వాస్తవం :** ఉరవ కొండ మండలంలో పెట్రోల్, డీజిల్ కొరత ఉందంటూ వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని తహశీల్దార్ భోగన్న గౌడ్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ప్రజలు ఆందోళన చెంద వద్దని కోరారు. ఉరవకొండ మండలంలో మొత్తం 9 పెట్రోల్ బంకులు ఉండగా, పట్టణంలో 6 బంకులు నిరంతరాయంగా సేవలు అందిస్తున్నాయి.

**ప్రస్తుత నిల్వలు:** పెట్రోల్: 32,830 లీటర్లు, డీజిల్: 50,303 లీటర్లు. పెట్రోల్ బంకుల్లో ఇంధనం నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, వినియోగదారులు పుకార్లను నమ్మవద్దని ఆయన సూచించారు. సాధారణం కంటే ఎక్కువ మొత్తంలో ఇంధనాన్ని నిల్వ చేసుకోవాల్సిన అవసరం లేదని, అన్ని బంకుల్లో సరఫరా సాధారణంగానే ఉందని ఆయన పేర్కొన్నారు.

# ఆంధ్రజ్యోతి విలేఖరి హత్యను ఖండించిన మండల పాత్రికేయులు



**బంగారు పాళ్యం - సూర్య వాస్తవం :** చిత్తూరు జిల్లా వి.కోటలో ఆంధ్రజ్యోతి విలేఖరి జగన్మోహన్ రెడ్డిని మంగళవారం ఉదయం కిరాయి రౌడీలు హత్య చేయడాన్ని నిరసిస్తూ బంగారుపాళ్యం మండల పాత్రికే యుల బృందం స్థానిక ఎస్ఐ ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నిందితులు ఎంతటి వారైనా సరే కఠినంగా శిక్షించాలని ఎంతటి వారైనా ఈపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమాపతి, శివ, శంకర్, చాను, రంగనాథ్, గోపి,చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# 30న ఆఫ్-సైట్ ఎమర్జెన్సీ మాక్ డ్రిల్‌ను విజయవంతం చేయాలి

## - జిల్లా ఇన్‌ఛార్జి డిఆర్వో వెంకటపతి



**కడప- సూర్య వాస్తవం:** ఈ నెల 30వ తేదీన కొప్పర్తి ఇండస్ట్రియల్ ఎస్టేట్ పరిసరాల్లోని అదీప్ ల్యాబొరేటరీ యూనిట్ లో నిర్వహిస్తున్న ఆఫ్-సైట్ ఎమర్జెన్సీ మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ చేపట్టి విజయవంతం చేయాలని జిల్లా ఇన్చార్జి డిఆర్వో వెంకటపతి పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం నుండి రాష్ట్రంలో ఆయిల్, కెమికల్ ఉత్పత్తి కేంద్రాల్లో విపత్తులను ఎలా ఎదుర్కోవాలో అవగాహన కల్పించే.. "ఆఫ్-సైట్ ఎమర్జెన్సీ మాక్ డ్రిల్ నిర్వహణ"పై ఏపీఎస్ డిఎంఏ అధికారులు అన్ని జిల్లాల సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలు నుండి జిల్లా ఇంచార్జి డిఆర్వో వెంకటపతి, ఇండస్ట్రీస్ ఇన్స్పెక్టర్ చీఫ్ చిన్నారావ్ సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర సీఎస్ అన్ని జిల్లాల అధికారులతో ఆయిల్, కెమికల్ విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనే చర్యలపై అవగాహనను పెంచే.. ఆఫ్-సైట్ ఎమర్జెన్సీ మాక్ డ్రిల్ నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షించారు. సిఎస్ విసి ముగిసిన అనంతరం ఇన్చార్జి డిఆర్వో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు, జిల్లా కలెక్టర్ సూచనల మేరకు, జిల్లా వ్యాప్తంగా అత్యవసర పరిస్థితుల నిర్వహణ సామర్థ్యాన్ని పరీక్షించేందుకు మరియు ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడానికి ఈ నెల 30వ తేదీన ఆఫ్-సైట్ ఎమర్జెన్సీ మాక్ డ్రిల్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మాక్ డ్రిల్ ప్రక్రియ.. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ మార్గదర్శకాల ప్రకారం నిర్వహించబడుతుందన్నారు. జిల్లాలోని కొప్పర్తి పరిశ్రమల ప్రాంతంలో ఉన్న "అదీప్ ల్యాబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్" మరియు సమీపంలోని పరిశ్రమల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ మాక్ డ్రిల్ ప్రక్రియలో భాగంగా అగ్ని ప్రమాదం, ప్రమాదకర రసాయనాల లీకేజీ వంటి అత్యవసర పరిస్థితులను మోడల్ రూపంలో ప్రదర్శించి, సంబంధిత విభాగాల సమన్వయాన్ని పరీక్షించనున్నారన్నారు. మాక్ డ్రిల్ సమయంలో కొప్పర్తి పరిసర ప్రాంతాల్లో భద్రతా కారణాల రీత్యా కొన్ని పరి మితులు అమలులో ఉంటాయన్నారు. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురి కాకుం డా, అధికారుల సూచనలను పాటిస్తూ ప్రజలు కూడా సహకరించాలని ఆయన కోరారు. ఈ మాక్ డ్రిల్ పూర్తిగా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగమే అని ప్రజల ప్రాణ, ఆస్తి భద్ర తను దృష్టిలో ఉంచుకుని నిర్వహిస్తున్న ఈ విన్యాసానికి ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కెఎంసి కమిషనర్ రాకేష్ చంద్రం, ఇండస్ట్రీస్ ఇన్స్పెక్టర్ చీఫ్ చిన్నారావ్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఇండస్ట్రీస్, విద్యుత్, ఫైర్, ఆర్టీవో, వ్యవసాయ అనుబంధ శాఖలు తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్ జగన్‌పై మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శలు



**ఉరవకొండ- సూర్య వాస్తవం :** ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ పాత్రికేయులతో మాట్లాడుతూ మంగళవారం ఒక అద్భుతమైన చారిత్రాత్మకమైన శంకుస్థాపన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీద గా జరిగింది. వారు సాధించిన ఈ విజయాన్ని రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకోవాలి ఈ గూగుల్ డేటాబేస్ సెంటర్ రావడా నికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఐటి మినిస్టర్ లోకేష్ కు మన జిల్లా తరపున రాష్ట్ర తరపున శు భాభినందనలు తెలియజేస్తున్నాను ఈరోజు అది ఒక భూమి పూజ లాగ కనిపించవచ్చు కానీ ఆ రోజు చిన్న ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ టవర్ కట్టింది ఈరోజు హైదరాబాద్ కు ఒక బొడ్రాయిలా తయారయింది హైటెక్ సిటీ అది హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ రూపురేఖలని మార్చేసింది.అనాడు మన రాష్ట్రంలో చదుకుంటున్న పిల్లలకు ఉద్యోగం జీవనోపాధి కల్పించడానికి మార్పుకు శ్రీకారం చుట్టడం జరిగింది. ఆరోజునా ఇంటర్నెట్ అంటే ఆరోజు ప్రతిపక్షం లో ఉన్న నేతలు ఇంటర్నెట్ మాకొద్దు పంపుసెట్లు కావాలని వెటకారం చేశారు. పంపుసెట్లు కూడా నేను తీసుకొచ్చాను. దానితో పాటు ఇది అవసరం అంటే ఐటీ ఏమైనా కూడు పెడుతుందా అని అన్నారు ఆరోజు ఉన్నటువంటి నాయకులు ఈ 20 ఏళ్ళ ఐటీ ప్రస్థానాన్ని చూసాం. ఇవాళ ప్రపంచం వ్యాప్తంగా పిల్లలు పొగలిగారు. ఇవాళ కొత్త అవకాశాలు ముందుకు వస్తువున్నాయి క్వాంటం టెక్నాలజీ మాలాంటి వాళ్ళకి కూడా అర్థం కాదు నేను దాని మీద అంత పోకస్ కానీ పెట్టను కానీ మా ముఖ్యమంత్రి రాబోయే 20 ఏళ్లలో అవకాశాలు ఎక్కడ ఉన్నాయి మన పిల్లలు ఎక్కడ అందిపుచ్చుకోవాలి. ఎలాంటి ప్లాటుఫారం క్రియేట్ చేయాలి అని నిరంతరం పనిచేస్తుంటాడు మా ముఖ్యమంత్రి మాకు రివ్యూ లు పెడుతుంటాడు ఒకవైపు క్వాంటం టెక్నాలజీ, మరోవైపు డేటా సెంటర్, డేటా సెంటర్ వచ్చినప్పుడు ఏమన్నారు అది ఒక గోడౌన్ దానిలో నాలుగు కంప్యూటర్లు ఉంటాయి అన్నారు ఎప్పుడైతే దాని గొప్పతనం తెలిసిందో లేదు నేనే తెచ్చాను. ఇదంతా క్రెడిట్ చోరీ అనే స్థాయికి వచ్చారు క్రెడిట్ గురుంచి ఆలోచించని నాయకుడు చంద్రబాబు నాయుడు ఏదయినా పని జరిగితే నాది జరకపోతే మీది అని చెప్పే నాయకుడు జగన్ మోహనరెడ్డి క్రెడిట్ చోరీ అనేది జగన్ మోహనరెడ్డి డిఎన్ఏ వుంది అన్నారు. మేము ఏదైతే 20 లక్షల ఉద్యోగాలు హామీ ఇచ్చామో ఈరోజు క్వాంటం వ్యాలీ, డేటా సెంటర్, అదిశగా అడుగులు పడుతున్నాయి. జగన్ మోహనరెడ్డి ఇండస్ట్రీ ఫ్రెండ్లీ అంటే ఎవరు నమ్మరు ఎందుకంటే మీ ప్రభుత్వం ఉన్నటువంటి రోజులలో ఉన్న పరిశ్రమలను తరిమేసి ఇప్పుడు వచ్చే సంస్థలను నేనే తెచ్చానంటే ప్రజలు నమ్మరు అమరావతిని నాశనం చేశారు వైజాగ్ ని నాశనం చేశారు మెడికల్ కాలేజ్ లు టెండర్లు వేయద్దంటారు.మీరు ఆపమన్నా ఆగదు ఈ గవర్నమెంట్ అన్ని విషయాల్లో అనుకున్న లక్ష్యాలు సాధించి తిరుతాం నేను ఇండస్ట్రీ ఫ్రెండ్లీ అని ఇండస్ట్రీ ద్వారా మా పిల్లలకి ఉద్యోగాలు పన్నుల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం రావాడానికి నేను పాజిటివ్ గా ఉంటానని మీరు అనండి మీరంటే వినాలని ఆంధ్రప్రదేశ్ యువత, పారిశ్రామిక వేతలు ఏడు ఏళ్ళ నుంచి ఎదురు చూస్తూన్నారు గూగుల్ నాదే ఆదాని నాదే అంటే ప్రజలు నమ్మరు ఎందుకంటే అమరావతి విషయంలో మాట మార్చారు కాబట్టి ఇప్పుడైనా పాజిటివ్ గా మాట్లాడాలని జగన్మోహన్ రెడ్డిపై ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ ఘాటుగా విమర్శలు గుప్పించాడు.

# పిడుగుపాటుకు 22 మూగజీవాల మృత్యువాత

## - గొర్రెల కాపరి మల్లికార్జునకు అస్వస్థత



**ఉరవకొండ - సూర్య వాస్తవం :** విడపనకల్లు మండలంలో ప్రకృతి ప్రకోపం విషాదాన్ని నింపింది. మండల పరిధిలో సోమవారం కురిసిన చిరుజల్లుల సమ యంలో ఒక్కసారిగా పిడుగు పడటంతో భారీ నష్టం వాటిల్లింది.

**ఘటన వివరాలు:** స్థానిక గొర్రెల కాపరి మల్లికార్జునకు చెందిన గొర్రెలు, మేకల మందపై పిడుగు పడింది. ఈ ప్రమాదంలో సుమారు 22 గొర్రెలు మరియు మేకలు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. మందపై పిడుగు పడిన సమయంలో గొర్రెల కాపరి మల్లికార్జున కూడా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు.

**చికిత్స, సహాయక చర్యలు:** అపస్మారక స్థితిలో ఉన్న మల్లికార్జునను స్థానికులు వెంటనే గమనించి, చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అప్పుడే కురిసిన స్వల్ప వర్షానికే పిడుగు పడటంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ జీవనోపాధిని కోల్పోయిన మల్లికార్జున కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి

# విభిన్న ప్రతిభావంతులకు
# తోడ్పాటు అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

- జీవనోపాధి దిశగా ఉచితంగా 60 మూడు చక్రాల స్కూటర్ల పంపిణీ
- జిల్లాలోని దివ్యాంగులకు ప్రత్యేకంగా ఆర్థిక అభివృద్ధి ప్రణాళికను రూపొందిస్తాం
- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం:** మంగళవారం మదనపల్లి కలెక్టరేట్ లోని ఆవరణలో విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సహాయ కార్పొరేషన్ ఆధ్వర్యంలో.. జీవనోపాధి మెరుగుపరిచే ఉద్దేశంతో 18 సంవత్సరాలు పైబడి 45 సంవత్సరాలు లోపు వయస్సు గల స్వయం ఉపాధి చేసుకునే వారు, చిన్నపాటి ఉద్యోగాలు నిర్వహించే వారు, అలాగే డిగ్రీ లేదా పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదువుతున్న విద్యార్థులు కలిపి మొత్తం 60 మంది విభిన్న ప్రతిభావంతులకు ఉచితంగా మూడు చక్రాల స్కూటర్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, ఏపీ విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల సహాయ సంస్థ చైర్మన్ జి నారాయణస్వామి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక సంకల్పంతో కృషి చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో జిల్లాలోని 60 మంది దివ్యాంగులకు ఒక్కొక్కరికి రూ.60 లక్షల విలువైన రెట్రో ఫిట్టేడ్ మూడు చక్రాల స్కూటర్లు ఉచితంగా పంపిణీ చేయడం సంతోషంగా ఉంది. రాష్ట్రంలోనే ప్రథమంగా ఈ పథకానికి జిల్లాలోని లబ్ధిదారులు ఎంపిక కావడం మనందరికీ గర్వకారణం అన్నారు. విభిన్న ప్రతిభావంతుల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని, ఈ త్రీ వీలర్ వాహనాలు వారి ఉపాధి అవకాశాలను పెంచడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఆర్థోపెడిక్ లోకోమోటివ్ వికలాంగత్వం ఉన్నవారికి ఇవి ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. ప్రత్యేకంగా ప్రయాణం చేసేటప్పుడు దివ్యాంగులకు ఎన్నో కష్టాలు ఉంటాయి. ఈ ఉచిత మూడు చక్రాల స్కూటర్లు వారి జీవనంలో అవసరాలకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ ఏడాది మార్చి 18న దివ్యాంగ శక్తి ఉచిత ప్రయాణాన్ని ప్రభుత్వం కల్పించిందని.. తద్వారా దివ్యాంగులందరికీ లబ్ధి కలిగిందన్నారు. కేంద్ర ఆర్టిఫిషియల్ లింగ్స్ కార్పొరేషన్ ద్వారా రూ1.68 కోట్ల విలువైన కృత్తిమ పరికరాలు, హియరింగ్ పరికరాలు జిల్లాకు వచ్చాయన్నారు. అవసరమైన వారు ఎవరికైనా పరికరాలు అందజేయడం జరుగుతుందని ఇందుకు సంబంధిత విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖను సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు. దివ్యాంగుల జీవితాలలో ఇబ్బందులను తొలగించాలంటే ఆర్థిక అభివృద్ధి ముఖ్యం. ఇందుకోసం జిల్లాలోని దివ్యాంగులకు ప్రత్యేకంగా ఆర్థిక అభివృద్ధి ప్రణాళికను రూపొం దిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను దివ్యాంగులు వినియోగించుకుని అభివృద్ధి పథంలో పయనించి వారి జీవితాలను ఆనందమయం చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ మాట్లాడుతూ... దివ్యాంగుల నిత్య జీవితానికి, వ్యాపారాలు చేసుకోవడానికి, ప్రయాణాలకు ఈ ఉచిత మూడు చక్రాల స్కూటర్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను అందిపుచ్చుకొని వారి జీవితాలను మెరుగుపరచుకోవాలని, మరింత ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల సహాయ సంస్థ చైర్మన్ జి నారాయణస్వామి మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వంలో దివ్యాంగులను అన్ని విధాల అభివృద్ధి పరిచేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. రాష్ట్రంలోనే ప్రప్రథమంగా నేడు జిల్లాలోని 60 మందికి ఒక్కొక్కరికి రూ.60 లక్షల విలువైన మూడు చక్రాల స్కూటర్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం జరుగుతుందని, దివ్యాంగ శక్తి పథకం ద్వారా దివ్యాంగులందరికీ ఉచిత ప్రయాణం కల్పించడం పట్ల ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. దివ్యాంగులకు ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమాలను అవగాహన కల్పించుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని మా జీవనానికి ఉపయోగపడేలా మూడు చక్రాల స్కూటర్లను ఇచ్చిందని, తమ జీవితాలలో ఇవి ఎంతో ఉపయో గపడతాయని ఇందుకు ముఖ్యమంత్రికి జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ముఖ్య అతిథులచే దివ్యాంగులకు ఉచిత మూడు చక్రాల స్కూటర్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సహాయ కార్పొరేషన్ సహాయ సంచాలకులు ఆర్ వి కృష్ణ కిషోర్, జిల్లా మేనేజర్, వారి సిబ్బంది, ఇతర ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## హామీలకే పరిమితమైన బస్టాండ్...

- ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి
- ఎండలో ఎండుతూ వానలో తడుస్తూ నార్పల ప్రయాణికుల నరకయాతన

**నార్పల - సూర్య వాస్తవం :** నార్పల మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మాణం గురించి సమాచారం ఆ ప్రాంతంలోని ప్రజల దశాబ్దాల కల, ప్రస్తుత అవసరాన్ని స్పష్టం చేస్తోంది. రాజకీయ హామీలు, అధికారుల జాప్యం మధ్య నలిగిపోతున్న సామాన్యులు. ఈ సమస్య పరిష్కార దిశగా అడుగులు వేయాలని గత ప్రభుత్వాల నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే వరకు హామీలు లభిస్తున్నా, క్షేత్రస్థాయిలో పురోగతి శూన్యం. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, విద్యార్థులు ఎండలో, వర్షంలో రోడ్డుపైనే వేచి ఉండటం అత్యంత దయనీయమైన పరిస్థితి ఏర్పడింది. మౌలిక వసతుల లేమి తాగునీరు, మరుగుదొడ్లు, కనీస షెల్టర్ లేకపోవడం అనేది ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాయడమే. బస్టాండ్ లేకపోవడం వల్ల స్థానిక వ్యాపారాలు దెబ్బతినడం గమనార్హం. ఇది మండల అభివృద్ధిని కుంటుపరుస్తోంది. తక్షణమే జరగాల్సినవి ప్రజల డిమాండ్ల మేరకు ప్రభుత్వం, యంత్రాంగం ఈ క్రింది చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఎమ్మెల్యే లేదా సంబంధిత ఆర్టీసీ అధికారులు బస్టాండ్ నిర్మాణానికి సంబంధించి అంచనా వ్యయం ఎంత, ?నిధుల కేటాయింపు జరిగిందా అనే అంశాలపై వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలి. శాశ్వత భవన నిర్మాణం అయ్యే వరకు కేవలం గ్రీన్ మ్యాట్లతో సరిపెట్టకుండా, కనీసం వర్షానికి తడవకుండా ఉండేలా తాత్కాలిక షెడ్లు, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలి. ఒకవేళ స్థలం సిద్ధంగా ఉంటే, తక్షణమే టెండర్లను ఆహ్వానించి పనులు ప్రారంభించేలా ఒత్తిడి పెంచాలి. ప్రజాస్వామ్యంలో ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలు గెలిచిన తర్వాత కూడా గుర్తుండాలి. నార్పల ప్రజలు కోరుతు న్నది విలాసవంతమైన భవనాన్ని కాదు, కనీస ఆత్మగౌరవంతో బస్సు కోసం వేచి ఉండే ఒక నీడను." అధికారులు మరియు ప్రజాప్రతినిధులు ఇకనైనా స్పందించకపోతే ఇది ప్రజా ఆందోళనగా మారే అవకాశం మెండుగా ఉందని నార్పల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



## న్యాయం గెలిచింది

- వైయస్ భాస్కర్ రెడ్డికి ప్రిబెయిల్ మంజూరు
- వైకాపా నాయకుల కు ఆనంద ఉత్సవం
- స్వీట్లు పంపిణీచేసిన వైకాపా నాయకులు



**పులివెందుల -సూర్య వాస్తవం :**
పులివెందుల నియోజకవర్గం ఇంచార్జ్ వైకాపా వైయస్ భాస్కర్ రెడ్డి కి న్యాయస్థానం ప్రీ బెయిల్ మంజూరు చేయడంతో పులివెందుల పట్టణంలోని వైకాపా నాయకులలో ఆనంద ఉత్సవం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా మాజీ చైర్మన్ రసూల్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో స్వీట్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప ,పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లె కిషోర్ లు హాజరై స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయం ఎప్పటికైనా గెలుస్తుందని వారు అన్నారు. చేయని తప్పుకు శిక్ష విధించాలని చూస్తే భగవంతుడు ఆయనను కాపాడడం జరిగిందన్నారు. ఆయన మీద కూటమి నాయకులు లేనిపోని ఆరోపణలు గతంలో చేయడం జరిగిందన్నారు. కానీ ఈరోజు న్యాయం గెలిచిందని వారన్నారు. ఈ కార్యక్రమంలో దేరంగుల చంద్రమౌళి, మాజీ కోఆప్షన్ నెంబర్ దాసరి చంద్రమౌళి, కనక, దాసరి ఈశ్వరయ్య, సోపాల వీరా, చెన్నూరు కార్తీక్, సంపత్, తదితర వైకాపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అభివృద్ధికి ఆమడదూరంలో మైలారంపల్లి, రాశిపల్లి గ్రామాలు

- చీకటి పడితే భయాందోళనలలో గ్రామస్తులు
- మౌలిక సదుపాయాలు లేక ప్రజల అవస్థలు



**ఉరవకొండ - సూర్య వాస్తవం:** మైలారం పల్లి, రాశిపల్లి గ్రామాల ప్రజలు దశాబ్దాలుగా కనీస సౌకర్యాలకు నోచుకోక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామాలు అన్ని రంగాల్లోనూ అభివృద్ధికి దూరంగా ఉండి పోయాయి. రహదారి సమస్య సరైన రహదారి సౌకర్యం లేక పోవడంతో అత్యవసర వైద్యం అవసరమైనప్పుడు ఆస్పత్రులకు వెళ్లడం గగనంగా మారింది. సరైన సమయంలో రవాణా సౌకర్యం అందక ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోందని స్థానికులు కన్నీరు మున్నీరవుతున్నారు. విద్యుత్, తాగునీరు పలు కాలనీల్లో ఇప్పటికీ విద్యుత్ సౌకర్యం లేదు. చీకటి పడితే గ్రామస్తులు భయాందోళనల మధ్య గడపాల్సి వస్తోంది. అలాగే, రక్షిత తాగునీరు అందక కిలోమీటర్ల మేర వెళ్లాల్సి వస్తోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి విన్నపం: తమ బాధలను పట్టించుకునే నాథుడే కరువయ్యారని, ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి యుద్ధ ప్రాతిపదికన రహదారులు, విద్యుత్ మరియు తాగునీటి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## విశేష పూజలు అందుకున్న పంచముఖ ఆంజనేయ స్వామి



**ఉరవకొండ -సూర్య వాస్తవం** :ఉరవకొండ పట్టణంలోని కనేకల్ క్రాస్ వద్ద ఉన్న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి సహిత శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం నిర్వహించిన పూజా కార్యక్రమాల వివరాలు చాలా భక్తిపారవశ్యంగా ఉన్నాయి. పంచామృత అభిషేకాలు: మంగళవారం పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారికి పాలు, పెరుగు, నెయ్యి, తేనె, చక్కెరలతో కూడిన పంచామృతాలతో విశేష అభిషేకాలను నిర్వహించడం విశేషం. ఈ ఆలయంలో ప్రతిరోజూ శాస్త్రోక్తంగా దీప, ధూప, నైవేద్యాలను సమర్పిస్తూ నిత్య పూజలు నిర్వహించడం వల్ల స్థానికులకు ఇది ఒక ముఖ్యమైన ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది. మంగళవారం హనుమంతుడికి ప్రీతికరమైన రోజు కావడంతో ఉరవకొండ పరిసర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు .

## భాగవత పఠనం విజయవంతం

- భక్తిశ్రద్ధలతో కలశ ప్రదర్శన



**సింహాద్రిపురం- సూర్య వాస్తవం :**సత్యసాయి జిల్లా మాత్ ఖాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం లో మంగళవారం భాగవత సప్తహ పఠనం విజయ వంతం అయింది. లక్ష్మీనరసింహ స్వామి భాగవత భక్త సమాజం నిర్వ హణలో ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి సహకారం లతోవిజయ వంతంగా ముగిసింది. చివరి రోజు పఠనం అనంతరం మంత్ర పుష్పం తదుపరి మహిళలచే ఆలయం చుట్టూభక్తిశ్రద్ధల నడమ కలశ ప్రదర్శనం కనుల పండువుగా నిర్వ హించారు భాగవత భక్త సమాజం వారు పండితులకు ఘన సన్మానం చేసారు. ఈ కార్యక్రమం లో రాయల సీమ భాగవత భక్త సమాజం మీడియా కన్వీనర్ యాగంటి బాలకృష్ణారెడ్డి ఆలయం సీనియర్ అసిస్టెంట్ శ్రీ ఓబులేసు సమాజం అధ్యక్షులు ఉమామహేశ్వరి మద్దన్న గారిపల్లి ఆంజనేయులు పందళ కుంట పుల్లారెడ్డి ముని రామిరెడ్డి లక్ష్మీరెడ్డి రామమోహన్‌రెడ్డి ముదిగుబ్బ మాధవీలత తదితరులు పాల్గొనారు.

## వేసవి విజ్ఞాన సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోండి

- గ్రంథాలయ అధికారి కృష్ణ కిషోర్ రెడ్డి



**పులివెందుల -సూర్య వాస్తవం :** పులివెందుల శాఖ గ్రంథాలయంలో 28వ తేదీ మంగళవారం నుండి వేసవి విజ్ఞాన క్యాంపు నిర్వహించడం జరుగు తుందని, గ్రంథాలయ అధికారి కృష్ణ కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొదటిరోజు రిసోర్స్ పర్సన్ గా పోలీస్ కానిస్టేబుల్ అశోక్ పాల్గొన్నారు. వాటిలో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠనం చిత్ర లేఖనం నేర్పించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి మాట్లాడుతూ వేసవి సెలవులలో పిల్లలు సమ్మర్ క్యాంపులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞానం పెంపొందించుకునేటువంటి అంశాలను ఈ సమ్మర్ క్యాంప్ ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథా లయ హెల్పర్ లక్ష్మి నరసమ్మ విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కలంపై కక్ష సాధింపు తగదు

- జర్నలిజంపై దాడి వినాశనానికే
- నిజం వైపు నిలబడే పాత్రికేయులకు రక్షణేదీ
- విలేకరి జగన్మోహన్ రెడ్డి కిరాతక హత్యను తీవ్రంగా ఖండించిన యువ న్యాయవాది ఏ నరేంద్ర



**కుప్పం – సూర్య వాస్తవం :** చిత్తూరు జిల్లా వి.కోటలో జర్నలిస్ట్ జగన్మోహన్ రెడ్డి పై జరిగిన దారుణమైన దాడి, హత్య సంఘటనను తాను, ఒక న్యాయవాది మరియు మానవ హక్కుల కార్యకర్తగా తీవ్రంగా ఖండిస్తున్నానని పేర్కొన్నారు. ఈ ఘటన కేవలం ఒక వ్యక్తిపై జరిగిన నేరం మాత్రమే కాకుండా, ప్రజాస్వామ్య వ్యవస్థపై జరిగిన ఘోర దాడిగా భావించాల్సిన అవసరం ఉంది. భారత రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛ (ఆర్టికల్ 19) మరియు జీవించే హక్కు (ఆర్టికల్ 21)లను ఈ హత్య బహిరంగంగా ఉల్లంఘించిందని తెలిపారు. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే పాత్రికేయుడిని లక్ష్యంగా చేసుకోవడం సమాజాన్ని భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నమని తెలిపారు. పట్టపగలు, ప్రజల మధ్యలో ఈ విధమైన హత్య జరగడం రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి ఎంత దుర్బలంగా ఉందో స్పష్టంగా చూపిస్తోందన్నారు. నిఘా వ్యవస్థ మరియు పోలీసు యంత్రాంగం సమర్థంగా పనిచేయకపోవడం వల్లే నేరస్థులు ఇంత ధైర్యంగా వ్యవహరించారు. ప్రజా స్వామ్యానికి నాలుగో స్థంభంగా పరిగణించబడే మీడియా ప్రతినిధులకు భద్రత కల్పించడం ప్రభుత్వపు బాధ్యత. ఈ విషయంలో ప్రభుత్వ వైఫల్యం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఈ హత్య వెనుక ఉన్న అసలు సూత్రధారులను బయటకు తీయడానికి సిట్టింగ్ జడ్జి ఆధ్వర్యంలో లేదా స్వతంత్ర ఉన్నత స్థాయి కమిటీ ద్వారా సమగ్ర దర్యాప్తు జరపాలని కోరారు.
ఈ కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు అప్పగించి, నిర్ణీత కాలవ్యవధిలో విచారణ పూర్తి చేసి నిందితులకు కఠిన శిక్ష విధించాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జర్నలిస్టుల భద్రత కోసం ప్రత్యేక చట్టాన్ని వెంటనే తీసుకురావాలని, అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## వైసీపీ జిల్లా అధ్యక్షుడుని గృహప్రవేశానికి ఆహ్వానించిన చెన్నకేశవరెడ్డి



పామిడి –సూర్య వాస్తవం : అనంతపురం వైఎస్ఆర్సిపి, జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే, అనంత వెంకట్రామిరెడ్డి, ఆలూరు సాంబశివారెడ్డిని అనంతపురం జిల్లా వైఎస్ఆర్సిపి ఆర్గనైజేషన్ సెక్రెటరీ చెన్నకేశవరెడ్డి, మే 14 తారీఖున నూతన గృహప్రవేశానికి ఆహ్వానించడం పత్రిక ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో, జిల్లా ప్రధాన కార్యదర్శి చక్కలూరు దిలీప్ రెడ్డి పామిడి, పట్టణ కన్వీనర్ నాగూర్ ఈశ్వర్ రెడ్డి జిల్లా బీసీ సెల్ ప్రధాన మీసాల రామచంద్ర జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి, పామిడి సూరి వాల్మీకి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీపీసీల్‌ను తనిఖీ చేసిన జేసీ



గుత్తి –సూర్య వాస్తవం : గుత్తి పట్టణం కర్నూల్ రోడ్డులో ఉన్న బీపీసీల్‌ను అనంతపురం జాయింట్ కలెక్టర్ తనిఖీ చేసారు. స్టాక్ వివరాలు, సరఫరా ఏ విధంగా చేస్తున్నారు అని వివరాలు తెలుసుకున్నారు.అనంతరము డి పో 24/7 రన్ చేయాలని ఆదేశాలు జారీ చేసారు.మరియు ఫిల్లింగ్ డిపో ను కూడా తనిఖీ చేశారు.ఈ కార్య క్రమములో ఇంచార్జ్ తహసీల్దార్ ఎం కె సూర్యనారాయణ, ఆర్ఐ హనుమాన్ ప్రసాద్, బాలరాజు విఆర్ఓ, బీపీసీఎల్ డిపో మేనేజర్ జ య రామన్ పాల్గొన్నారు.

## ఎద్దుల కొండ్రాయుని పరామర్శించిన తులసి రెడ్డి





**వేంపల్లె –సూర్య వాస్తవం :** వేంపల్లె శ్రీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ఎద్దుల కొండ్రాయుడు (కొండయ్య )ఇటీవల అనారోగ్యంతో హైదరాబాదులో కడుపుకు శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటికి వచ్చారు.ఈ విషయం తెలుసుకున్న రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి,ఉత్తన్న,బండారు వెంకటేశు, నామా వినయ్ , ఐచర్ రమణ కొండయ్యను ఇంటి వద్ద పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కొండయ్య త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## గండి వీరాంజనేయస్వామి ఆలయ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవం

**- ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న బీటెక్ రవి**

**వేంపల్లె – సూర్య వాస్తవం:** పవిత్ర పుణ్యక్షేత్రమైన గండి క్షేత్రంలో కొలువైన శ్రీ వీరాంజనేయ స్వామి వారి ఆలయ నూతన ధర్మకర్తల మండలి (పాలకమండలి) ప్రమాణ స్వీకారోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో భాగంగా పాలకమండలి చైర్మన్‌గా కల్లూరి వెంకటస్వామి తో పాటు మరో 10 మంది సభ్యులు భగవంతుని సాక్షిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ విశేష కార్యక్రమానికి హాజరైన పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి ముందుగా ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మా రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, వెంపల్లె టీడీపీ ఇంచార్జ్ అజ్జుగుట్టు రఘునాథరెడ్డి తో కలిసి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ మరియు సభ్యులకు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఆలయ అభివృద్ధికి అంకితభావంతో కృషి చేయాలని నూతన కార్యవర్గానికి పిలుపునిచ్చారు.ఆలయ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు నూతన పాలకమండలి అంకితభావంతో కృషి చేయాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. ఆలయ అర్చకులు నూతన కార్యవర్గానికి వేదాశీర్వచనాలు అందించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.
గండి వీరాంజనేయస్వామి ఆలయ నూతన పాలకమండలి సభ్యులు
1.?కల్లూరి వెంకటస్వామి - టి.డి.పి, 2.పల్లా శ్రీనివాసులు - జనసేన, 3.కొర్రకుటి రామచంద్రారెడ్డి - బి.జె.పి, 4.బొజ్జ జయలక్ష్మి దేవి - టి.డి.పి, 5.సింగం గణపతిరెడ్డి - టి.డి.పి, 6.యెద్దుల రామతులసి - టి.డి.పి, 7.గండికోట లావణ్య - టి.డి.పి, 8.వరద పార్వతమ్మ - టి.డి.పి, 9.కందాచారం జయశ్రీ - టి.డి.పి, 10.సరస్వతి సతుపతి - టి.డి.పి, 11. నాగులగల్ల సునీత - టి.డి.పి.

## పోలేరమ్మ అమ్మవారికి పూజలు నిర్వహించిన మఠాధిపతి శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వామి

**బ్రహ్మంగారిమఠం– సూర్య వాస్తవం:** జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి 333 వ ఆరాధన గురు పూజ మహోత్సవాలలో రథోత్సవం అనంతరం మఠం 12వ మఠాధిపతులు పూజ్య శ్రీ శ్రీ శ్రీ వీరధర్మజ వేంకటాద్రి స్వాములవారు వారి ధర్మపత్ని శ్రీమతి ఉమాదేవి అమ్మగారు మఠాధిపతి తమ్ముడు శ్రీ దత్తాత్రేయ స్వాములవారు వారి కుటుంబ సభ్యులు శ్రీ కనుమ పోలేమ్మ వారి సన్నిధిలో అమ్మవారికి పాల పొంగలి సమర్పించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. అనంతరం శ్రీ కనుమ పోలేరమ్మ వారికి గుడి రథోత్సవంలో మఠం మఠాధిపతులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## ఆంధ్రజ్యోతి విలేకరి జగన్ మోహన్ రెడ్డి హత్య దారుణం

**- హత్యను ఖండించి నిరసన వ్యక్తం చేసిన కుప్పం పాత్రికేయులు**
**- హంతకులను అరెస్టు చేసి శిక్షించాలని చేయాలని డిమాండ్**
**- ఫోర్త్ ఎస్టేట్ భద్రత పై నీలినీడలు భయం గుప్పిట్లో జర్నలిస్టులు**



**కుప్పం– సూర్య వాస్తవం:** వి.కోటలో జరిగిన ఆంధ్రజ్యోతి విలేకరి జగన్ మోహన్ రెడ్డి హత్య ఘటనపై పలు జర్నలిస్ట్ సంఘాలు తీవ్రంగా స్పందించాయి. కుప్పంలో పాత్రికేయ సంఘాలు ఈ ఘటనను ఖండిస్తూ నిరసనలు చేపట్టాయి. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ "విలేకరులపై దాడి ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణించారు. నిజాలను వెలుగులోకి తీసుకువచ్చే పాత్రికేయులను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు.హత్యకు పాల్పడిన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే, బాధిత కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని కోరారు.ఈ దాడిలో గాయ పడిన వికోట ప్రజాశక్తి విలేకరి మణి కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ విలేకరుల భద్రత కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని కూడా సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు స్థానిక డిఎస్పీకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కుప్పం ప్రెస్ క్లబ్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## ఆంధ్రజ్యోతి విలేకరిని హత్య చేసిన నిందితులను శిక్షించాలి

**సిఐకు జర్నలిస్టులు వినతి పత్రం**



**వేంపల్లె – సూర్య వాస్తవం:** చిత్తూరు జిల్లాలోని వి. కోట మండలానికి చెందిన ఆంధ్రజ్యోతి విలేకరి జగన్ మోహన్ రెడ్డిని కిరాతకంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని వేంపల్లె జర్నలిస్టులు డిమాండ్ చేశారు.
మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్ లో సిఐ నర్సింహులు, ఎస్ఐ తిరుపాల్ నాయక్ లకు వేంపల్లె జర్నలిస్టులు తరపున నిందితులను కఠినంగా శిక్షించాలని వినతి పత్రం అందజేశారు. ఆంధ్రజ్యోతి విలేకరి జగన్ మోహన్ రెడ్డి వాకింగ్‌కు వెళ్లిన సమయంలో నిందితులు వెంటాడి కత్తులతో దారుణంగా నరికి హత్య చేయడం అమాను షమని తెలిపారు. కత్తులతో దాడి చేయడంతో ప్రాణాలు కాపాడుకోలేని దుస్థితిలో విలేకరులు ఉన్నారని చెప్పారు. ఇలాంటి దాడులు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకొని రావాలని జర్నలిస్టులు కోరారు. నిందితులను కఠినంగా శిక్షించడంతో పాటు ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు. సమాజంలో జరిగే అ అన్యాయాలను ఎత్తి చూపే జర్నలిస్టులపై దాడులు జరపడం దురదృష్టకర మని చెప్పారు. హత్యకు గురైన జర్నలిస్ట కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. విలేకరిని హత్య చేయడం చాలా బాధకరమని సిఐ నర్సింహులు తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని సిఐ హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో వేంపల్లె జర్నలిస్టులు, హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దివాకర్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యంలో హత్యా రాజకీయాలకు తావులేదు

**- పాత్రికేయుని హత్యచేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి**
**- సీనియర్ పాత్రికేయులు ఎస్ఎస్ఆర్ ఆంజనేయులు డిమాండ్**

చిత్తూరు– సూర్య వాస్తవం: చిత్తూరు జిల్లా వి.కోట ఆంధ్రజ్యోతి విలేఖరి జగన్మోహన్ రెడ్డిని హత్య చేసిన నిందితులను వెంటనే శిక్షించాలని, నాన్ బెయిలబుల్ కేసును నమోదు చేసి వారిని కఠినంగా శిక్షించాలని సీనియర్ పాత్రికేయులు ఎస్. ఎస్. ఆర్. ఆంజనేయులు డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో హత్యా రాజకీయాలకు తావులేదని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పత్రికా వ్యవస్థను కాపాడాలని, పాత్రికేయులకు రక్షణ కల్పించాలని ఎస్.ఎస్.ఆర్. రాష్ట్ర ముఖ్యమంత్రికి, హోం శాఖా మంత్రికి విజ్ఞప్తిచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఉద్యమం బలపడకముందే ప్రభుత్వం మేల్కొనాలని, 24 గంటల్లో నిదితులను అరెస్టుచేయాలని ఆయన రాష్ట్ర పోలీస్ డి.జి.పి.కి విజ్ఞప్తి చేశారు.

## దానాలన్నింటిలో కల్లా అన్నదానం మిన్న

**-మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుష్మ.**




వేంపల్లె –సూర్య వాస్తవం : భారతీయ జనతా మహిళా మోర్చా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షురాలు నిషిధ రాజు జన్మదినాన్ని పురష్కరించుకుని మంగళవారం వేంపల్లెలో స్థానికంగా ఉన్నటువంటి అమ్మ అనాధ వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. నిషిధ రాజు పుట్టినరోజును ఒక సేవా దృక్పథంతో జరుపుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టారని తెలిపారు. హిందూ సాంప్రదాయంలో అన్నదానం అత్యంత పవిత్రమైన మరియు గొప్ప దానంగా భావించబడుతుంది. అన్నం పరబ్రహ్మ స్వరూపం అని అంటారు. ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించడం వల్ల వారి కడుపు నిండటమే కాకుండా, వారి ఆత్మ సంతృప్తి చెందుతుందని, దీనివల్ల గొప్ప పుణ్యఫలం లభిస్తుందని నమ్మకం. ఈ సందర్భంగా అక్కడ ఉన్నటువంటి పెద్దలు, బీజేపీ పార్టీ శ్రేణులు నిషిధ రాజుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియచేస్తూ ఆమెకు దేవుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరారు . ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుష్మ, వేంపల్లె మండల అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు సౌభాగ్య, కడప జిల్లా వాణిజ్య దొంతు సుమన్ , చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన గురు పూజా మహోత్సవాలు

**బ్రహ్మంగారిమఠం– సూర్య వాస్తవం:** జగన్మాత శ్రీ ఈశ్వరీ దేవి మఠంలో మహా ప్రసాద వినియో గంతో శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి 333 వఆరాధన గురు పూజ మహోత్సవాలు ముగిసినట్లు ఈవో జగన్మోహన్ రెడ్డి తెలిపారు. మంగళవారం శ్రీ ఈశ్వరీ దేవి మఠం మఠాధిపతి శ్రీశ్రీశ్రీ వీరశివకుమారస్వాములవారి చేతులమీదుగా వేలాదిమంది భక్తులకు ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మఠాధిపతి తమ్ముడు శ్రీ సంపత్ కుమార్ స్వామి ఉన్నారు. కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం లోపట్నూతల గ్రామం వారు శాశ్వత ఉభయదాతలు పుల్లకూర వెంకటపతి ధ। అచ్చమ్మ కు॥ శ్రీ రామయ్య కు॥ పార్థసారధి వీరుడు, పలు సంస్కృతిక , పూజ కార్యక్రమాలు నిర్వహించారు.



### 'గాయపడ్డ సింహం'లో నా క్యారెక్టర్ ను

# ఆడియన్స్ కచ్చితంగా ఎంజాయ్ చేస్తారు

## : ఫరియా అబ్దుల్లా

హిలేరియస్ ఎంటర్టైనర్‌గా గాయపడ్డ సింహం
ఈ చిత్రంలో ఫన్ వైబ్ ఉన్న వ్లాగర్ పాత్రలో ఫరియా
తరుణ్ భాస్కర్ కామెడీ టైమింగ్ అద్భుతంగా ఉంటుందని వెల్లడి
శ్రీవిష్ణు స్పెషల్ రోల్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణ
మే 1న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల



దర్శకుడిగా, నటుడిగా విభిన్న చిత్రాలతో ఆకట్టుకుంటున్న తరుణ్ భాస్కర్ హీరోగా, యువ దర్శకుడు కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వంలో వస్తున్న కొత్త చిత్రం 'గాయపడ్డ సింహం'. ఈ సినిమాలో హీరో శ్రీవిష్ణు ఓ ప్రత్యేక పాత్రలో కనిపించనుండటం విశేషం. పవన్ సాదినేని సమర్పణలో సప్తస్వ మీడియా వర్క్స్, పిఓవి స్టోరీస్, జీ స్టూడియోస్ బ్యానర్లపై కళ్యాణ చక్రవర్తి మంథిన, భాను కిరణ్ ప్రతాప, విజయ్ కృష్ణ లింగమనేని, ఉమేష్ బన్సల్ నిర్మించారు. ఫరియా అబ్దుల్లా, మానస చౌదరి కథానాయికలుగా నటించగా, జేడీ చక్రవర్తి కీలక పాత్ర పోషించారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేశాయి. మే 1న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ చిత్రం సందర్భంగా హీరోయిన్ ఫరియా అబ్దుల్లా విలేకరులతో ముచ్చటించారు.

ఈ సందర్భంగా ఫరియా మాట్లాడుతూ, ""గాయపడ్డ సింహం'లో నేను ఒక మంచి క్యామియో రోల్ చేశాను. నా పాత్ర పేరు శాలిని, ఒక వ్లాగర్. ఇందులో మంచి ఫన్ వైబ్ ఉంటుంది. తరుణ్ గారితో ఒక రొమాంటిక్ ట్రాక్ కూడా ఉంటుంది. ఇది మల్టిపుల్ లేయర్స్‌లో జరిగే కథ. ప్రతి పాత్రకు ప్రాధాన్యత ఉంటుంది. నా క్యారెక్టర్‌లో కామెడీ పాళ్లు ఎక్కువగా ఉంటాయి. దర్శకుడు కశ్యప్ క్రియేట్ చేసిన ప్రపంచం, పాత్రలు అన్నీ చాలా హిలేరియస్‌గా వచ్చాయి. సినిమా చూసిన ప్రేక్షకులకు మళ్లీ చూడాలనిపిస్తుంది" అని తెలిపారు. తరుణ్ భాస్కర్‌తో కలిసి పనిచేయడంపై స్పందిస్తూ, "తరుణ్ గారు చాలా సరదాగా ఉంటారు. ఆయన కామెడీ టైమింగ్ నెక్స్ట్ లెవెల్. ఆయనతో సీన్స్ చేస్తున్నప్పుడు చాలా ఎంజాయ్ చేశాను. ఆయన చిన్న ఎక్స్‌ప్రెషన్ ఇచ్చినా నాకు నవ్వు వచ్చేస్తుంది. సినిమా ఫైనల్ అవుట్‌పుట్ చూశాను, చాలా అద్భుతంగా వచ్చింది. కచ్చితంగా హిట్ అవుతుందనే నమ్మకం ఉంది" అని ఫరియా అన్నారు. శ్రీవిష్ణు పాత్ర కూడా చాలా ఆసక్తికరంగా ఉంటుందని, ప్రేక్షకులు తప్పకుండా ఎంజాయ్ చేస్తారని ఆమె పేర్కొన్నారు. దర్శకుడు కశ్యప్ శ్రీనివాస్ గురించి మాట్లాడుతూ, "కశ్యప్ గారి కామెడీ టైమింగ్ చాలా పెక్యులర్‌గా ఉంటుంది. యాక్షన్, రొమాన్స్, కామెడీ వంటి అన్ని అంశాలను కలిపి ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు. ఆయన కూడా ఈ సినిమాలో ఒక పాత్రలో నటించారు, ఆయన నటన, దర్శకత్వం రెండూ అద్భుతంగా ఉన్నాయి" అని ప్రశంసించారు. ఈ చిత్రంలో జేడీ చక్రవర్తి, పవన్ సాదినేని వంటి దర్శకులు ఉండటం మంచి అనుభవమని, 'సత్య' నుంచి 'పెళ్లి చూపులు' వరకు ఎన్నో విషయాలు మాట్లాడుకునేవాళ్లమని గుర్తుచేసుకున్నారు. స్వీకర్ అగస్తి సంగీతం అందించిన 'బ్రైడ్', 'జింగాల' పాటలు తన ఫేవరెట్స్ అని ఫరియా తెలిపారు. ప్రస్తుతం తాను 'భగవంతుడు', 'సిగ్మా' చిత్రాలతో పాటు సత్యదేవ్‌తో ఒక సినిమాలో నటిస్తున్నానని, వచ్చే ఏడాది దర్శకత్వం చేసే ఆలోచనలో ఉన్నానని తన భవిష్యత్ ప్రణాళికలను పంచుకున్నారు.

# నాగ్ 100లో టబు

నటుడు నాగార్జున ప్రస్తుతం తమిళ దర్శకుడు కార్తీక్ దర్శకత్వంలో 100వ చిత్రంలో నటిస్తున్నారు. చాలా రోజుల నుండే ఈ చిత్రం షూటింగ్ జరుపుకుంటోంది. ప్రస్తుతం హిమాచల్ ప్రదేశ్‌లోని కులుమనాలీ పరిసరాల్లో సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమాలో సీనియర్ నటి టబు ఒక కీలక పాత్ర పోషిస్తున్నారని ఎప్పటినుండో వార్తలు వస్తున్నాయి. తాజాగా టబు తన ఇన్ స్టా అకౌంట్ లో నాగార్జున 100లో నటిస్తున్నట్టు పోస్ట్ చేశారు. దాదాపు 20 ఏళ్ల తర్వాత నాగార్జున -- టబు కలిసి నటించబోతున్నారు. ఈ సినిమలో నాగ్ సరసన ముగ్గురు హీరోయిన్లు నటిస్తున్నట్టుగా తెలుస్తోంది. మే నెలాఖరుకు నాగార్జునకు సంబంధించిన కీలక సన్నివేశాల చిత్రీకరణ పూర్తి చేయాలని చిత్ర యూనిట్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ చిత్రానికి 'లాటరీ కింగ్', 'కింగ్ 100' అనే పేర్లు పరిశీలిస్తున్నట్లు టాక్. ఈ



చిత్రంలో నాగ్ డి-ఏజింగ్ టెక్నాలజీ ద్వారా 25 ఏళ్ల యువకుడిగా కనిపించబోతున్నారు.

### ఫ్యాన్స్‌తో కలిసి

# పుట్టినరోజు వేడుకలు జరుపుకున్న సమంత

- నేడు సమంత పుట్టినరోజు
- చాలా ఏళ్ల తర్వాత ఫ్యాన్స్‌తో కలిసి కేక్ కట్ చేసిన స్టార్ హీరోయిన్
- రాజ్ నిడిమోరుతో పెళ్లి తర్వాత సమంతకు ఇది తొలి పుట్టినరోజు
- నయనతార, వరలక్ష్మి వంటి తారల నుంచి శు భాకాంక్షలు
- మే 15న 'మా ఇంటి బంగారం' విడుదల



స్టార్ హీరోయిన్ సమంత తన పుట్టిన రోజును అభిమానుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ వేడుకలో ఆమె ఫ్యాన్స్‌తో కలిసి కేక్ కట్ చేశారు. దర్శకుడు రాజ్ నిడిమోరుతో వివాహం తర్వాత ఆమెకు ఇది తొలి పుట్టినరోజు కావడం విశేషం. చాలా కాలం తర్వాత సమంత తన అభిమానులతో నేరుగా సమయం గడపడం ఈ వేడుకకు ప్రత్యేకతను తెచ్చిపెట్టింది. అభిమానుల మధ్య ఎంతో ఆనందంగా కనిపించిన సమంత, వారితో సరదాగా మాట్లాడుతూ ఫొటోలకు పోజులిచ్చారు. ఈ వేడుకకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. తన వ్యక్తిగత జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభమైన తర్వాత అభిమానులతో ఇలా మమేకం కావడం పట్ల ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సమంతకు సినీ పరిశ్రమ నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి.



# పంజాబ్ జోరుకు రాజస్థాన్ కళ్లెం

## జైస్వాల్, ఫెర్రేరా ధనా ధన్



**న్యూ ఛండీగఢ్:** ఐపిఎల్ సీజన్ 19లో పంజాబ్ కింగ్స్ జోరుకు రాజస్తాన్ కళ్లెం వేసింది. వరుసగా ఆరు మ్యాచుల్లో గెలిచిన పంజాబ్ జట్టు స్వంత మైదానంలో రాజస్తాన్ చేతిలో ఓటమి పాలైంది. తొలుత పంజాబ్ బ్యాటర్లుగుల వరద పారించారు. దీంతో తొలిగా బ్యాటింగ్ కు దిగిన పంజాబ్ కింగ్స్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 222 పరుగులు చేసింది. ఆ లక్ష్యాన్ని రాజస్తాన్ 19.2 ఓవర్లలో కేవలం 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. జైస్వాల్(51), ఫెర్రెరా (52నాటౌట్) అర్ధ సెంచరీలతో రాణించి మ్యాచ్ ను ముగించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ఫెర్రెరాకు దక్కింది. ఛేదనలో రాజస్తాన్ ఓపెనర్లు 3.2 ఓవర్లలోనే 51 పరుగులు జతచేశారు. ఆ తర్వాత సూర్యవంశీ(43) ఔటైనా.. జైస్వాల్ అర్ధశతకంతో మెరిసాడు. రియాన్ పరాగ్(29), శివమ్ దూబే(31నాటౌట్) కూడా రాణించారు. దీంతో రాజస్తాన్ మరో 4 బంతులు మిగిలి ఉండగానే 228 పరుగులు చేసి గెలిచింది. .

టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ నిర్ణయం తప్పని పంజాబ్ ఓపెనర్లు నిరూపించారు. ముఖ్యంగా యువ బ్యాటర్ ప్రియాన్ష్ ఆర్య (11 బంతుల్లో 29) ఆరంభం నుంచే బాదుడు మొదలుపెట్టాడు. ఐదు ఫోర్లు, ఒక సిక్సర్‌తో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ఆర్య ఔటైనప్పటికీ, పవర్‌ప్లే ముగిసేసరికి పంజాబ్ వికెట్ నష్టానికి 65 పరుగులు చేసి బలమైన పునాది వేసుకుంది. మరో ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ (44 బంతుల్లో 59) ఒక ఎండ్‌లో నిలకడగా ఆడుతూ కీలక అర్ధ శతకాన్ని నమోదు చేశాడు. అయితే, కనోలీ, ప్రభ్‌సిమ్రన్ వరుస ఓవర్లలో ఔటవ్వడంతో పంజాబ్ స్కోరు వేగం కాస్త మందగించినట్టు అనిపించింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (27 బంతుల్లో 30) నెమ్మదిగా ఆడినా, వికెట్ల పతనాన్ని అడ్డుకున్నాడు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన మార్కస్ స్టోయినిస్ మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. రాజస్థాన్ బౌలర్లపై కనికరం లేకుండా విరుచుకుపడ్డాడు. కేవలం 22 బంతుల్లోనే 4 ఫోర్లు, 6 సిక్సర్లతో అజేయంగా 62 పరుగులు చేసి ఆఖరి ఓవర్లలో స్కోరును అమాంతం పెంచేశాడు. అతని విధ్వంసంతో పంజాబ్ సునాయాసంగా 220 పరుగుల మార్కును దాటింది. రాజస్థాన్ బౌలర్లలో యశ్ రాజ్ పుంజా రెండు వికెట్లు పడగొట్టినా, ధారాళంగా పరుగులు సమర్పించుకున్నాడు. నాంద్రే బర్గర్ 4 ఓవర్లలో ఏకంగా 59 పరుగులు ఇచ్చాడు. జోఫ్రా ఆర్చర్ ఒక వికెట్ తీశాడు. ఒక్క రవీంద్ర జడేజా (4 ఓవర్లలో 32) మాత్రమే కాస్త పొదుపుగా బౌలింగ్ చేశాడు. మొత్తంగా, పంజాబ్ బ్యాటర్ల ధాటికి రాజస్థాన్ బౌలర్లు తేలిపోయారు. ఈ భారీ లక్ష్యాన్ని ఛేదించాలంటే రాజస్థాన్ బ్యాట ర్లు అసాధారణ ప్రదర్శన చేయాల్సి ఉంటుంది.

స్కోర్ బోర్డు...
పంజాబ్ కింగ్స్ : 222/4(20 ఓవర్లలో)
ప్రభ్ సిమ్రన్ సింగ్ (59), స్టొయినీస్(62నాటౌట్)
యశ్ రాజ్ 2/41), ఆర్చర్ (1/40)
రాజస్తాన్ : 228/4(19.4 ఓవర్లలో)
జైస్వాల్ (51), ఫెర్రెరా (52నాటౌట్),
చాహల్ (3/36)
ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ఫెర్రేరా

# పోటపోవా సంచలనం

**- ప్రి క్వార్టర్స్ లో రైబకినాపై గెలుపు**



**మాడ్రిడ్:** మాడ్రిడ్ ఓపెన్‌లో పెను సంచలనం నమోదైంది. మహిళల సింగిల్స్‌లో 2వ సీడ్, కజకిస్తాన్ కు చెందిన రైబకినా అనూహ్యంగా ప్రి క్వార్టర్ ఫైనల్లోనే నిష్క్రమిం చింది. మంగళవారం జరిగిన ప్రి క్వార్టర్స్ లో రైబకినా 6-7(8-10), 4-6తో అన్ సీడెడ్ పొటపోవా చేతిలో ఓడింది. ఇక పురుషుల సింగిల్స్ లో టాప్ సీడ్,ఇటలీకి చెందిన జెన్నిక్ సిన్నర్ 6-2, 7-5తో 19వ సీడ్, డెన్మార్క్ కు చెందిన నొర్రీని ఓడించి క్వార్టర్ ఫైనల్ కు చేరాడు. ఇక 21వ సీడ్ ఫిల్స్ (ఫ్రాన్స్) 6-3, 6-4తో ఎచెవెర్రి (అర్జెంటీనా)ను ఓడించాడు. మరో పోటీలో 6వ సీడ్, ఇటలీకి చెందిన మసెట్టి అనూహ్యంగా ప్రి క్వార్టర్స్ లో ఓడాడు. 3-6, 3-6తో 11వ సీడ్ లెహెక్కా (చెక్) చేతిలో పరాజయాన్ని చవిచూశాడు.

# ఉబర్ కప్‌లో ముగిసిన భారత్ పోరు

**-చైనా చేతిలో 5-0తో ఓటమి**



**హోర్‌సెన్స్(డెన్మార్క్):** ఉబర్ కప్ టీమ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ లో భారత మహిళల పోరాటం ముగిసింది. మంగళవారం జరిగిన గ్రూప్ చివరి లీగ్ మ్యాచ్ లో భారత్ 0-5తో చైనా చేతిలో ఓటమిపాలైంది. తొలి సింగిల్స్ లో పివి సింధు16-21, 2-19, 19-21తో ప్రపంచ 2వ ర్యాంకర్ వాంగ్ జీహీ చేతిలో పోరాడి ఓడింది. దీంతో చైనా 1-0ఆధిక్యతలో నిలిచింది. ఇక తొలి డబుల్స్ లో ప్రియ-శృతి జంట 11-21, 8-21తో మహిళల డబుల్స్ టాప్ సీడ్ జంట లీ షెంగ్-టాంగ్ నింగ్ చేతిలో చిత్తుగా ఓడారు. ఆ తర్వాత సింగిల్స్ లో 4వ ర్యాంకర్ చెన్-యూఫీ22-20, 21-13తో కేవలం 44నిమిషాల్లోనే భారత షట్లర్ ను చిత్తు చేసింది. దీంతో భారతజట్టు ఈ మ్యాచ్ ను చేజార్చుకుంది. రెండో మహిళల డబుల్స్ లో ట్రీసా జోలీ-కవి ప్రియ 10-21, 21-12, 19-21తో59వ నిమిషాల్లో లూ షీ మిన్ -జంగ్ షూ చేతిలో ఓడారు. ఇక చివరి, ఆఖరి సింగిల్స్ లో పివి సింధు బరిలోకి దిగినా.. ఆ గేమ్ ను సింధు పోరాడి ఓడింది. దీంతో భారతజట్టు 5-0తో మ్యాచ్ ను చేజార్చుకొని టోర్నీ నుంచి నిష్క్రమించింది.

# రైతుల పాలిట శాపాలు
# చంద్రబాబు, మోడీ ప్రభుత్వాలు

## - డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లె -సూర్య వాస్తవం :** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం రైతుల పాలిట శాపాలుగా మారాయని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి విరుచుకుపడ్డారు. మంగళవారం వేంపల్లిలో తులసి రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ రైతులు పండించిన ఏ పంటకు కూడా గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. అడిగే వారు లేరు కొనేవారు లేరు.ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు ఉలుకు పలుకు లేకుండా పడి ఉన్నాయి అని ఆవేదన వెలిబుచ్చారు. రాష్ట్రంలో మొక్కజొన్న పండించిన రైతులు విలవిలలాడుతున్నారు. ఈ రబీ సీజన్లో 42.0 6 లక్షల మెట్రిట్ టన్నుల మొక్కజొన్న దిగుబడి వచ్చింది. కేంద్ర ప్రభుత్వము ప్రకటించిన కనీసం మద్దతు ధర క్వింటాలకు రు 2,400, కానీ మార్కెట్లో రైతులు క్వింటాలకు 1600 రూపాయలకు మాత్రమే అమ్ముకుంటున్నారు. ఒక్కొక్క క్వింటాల్ మీద రైతు దాదాపు 800 రూపాయలు నష్టపోతున్నాడు. ఇంతవరకు ఒక్క కొనుగోలు కేంద్రం కూడా రాష్ట్రంలో ఏర్పాటు చేయలేదు . కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మీన మేషాలు లెక్కిస్తూ, లేఖలు రాసుకుంటూ ఉన్నాయి . రోమ్ నగరం తగలబడి పోతా ఉంటే నీరో చక్రవర్తి ఫిడేల్ వాయిస్తూ కూర్చున్నట్లు ఉంది మోడీ,చంద్రబాబు ప్రభుత్వాల పనితీరు.పక్కనున్న తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు తెరిచి కనీస మద్దతు ధరకు మొక్కజొన్న కొంటూ ఉంది. కానీ దార్శనికుని అని చెప్పుకుంటున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి రాష్ట్రంలో ఇప్పటివరకు మొక్కజొన్నకు సంబంధించి ఒక్క కొనుగోలు కేంద్రం కూడా ఏర్పాటు చేయలేదు.కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాసుకుంటూ కూర్చున్నాడు.ఈ లోపల మొక్కజొన్న రైతులు వ్యాపారస్తులు అడిగిన కాడికి అమ్ముకుంటున్నారు.ఏ మాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, కనీస మద్దతు ధరకు కొని రైతులను ఆదుకోవాలని తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

గోరుచుట్టుపై రోకటి పోటులా ఇటీవల రసాయన ఎరువుల ధరలు విపరీతంగా పెరిగాయి ఒకవైపు గిట్టు బాటు ధర లభించక,వ్యవసాయం గిట్టుబాటు గాక రైతు అల్లాడిపోతుంటే మరొకవైపు కేంద్ర ప్రభుత్వం ఎరువుల ధరలు అమాంతంగా పెంచడం దుర్మార్గం. 14 -35 -14 గత కొంతకాలం వరకు 50 కేజీల బస్తా 1950 రూపాయలు ఉండగా ఇటీవల 2350 పెంచడం జరిగింది . అంటే ఒక్కొక్క బస్తా మీద 400 రూపాయలు పెరిగింది. మ్యూరేట్ ఆఫ్ పొటాషియం గతంలో 1800 రూపాయలు ఉంటే ఇప్పుడు 1975 రూపాయలు అయింది.అంటే బస్తా మీద 175 రూపాయలు పెంచడం జరిగింది . 24 -24-0- 8 రసాయనికి ఎరువు 50 కేజీల బస్తా ఇటీవల వరకు 1700 రూపాయలు ఉండగా ప్రస్తుతం 2150 రూపాయలు అయింది. అంటే బస్తా మీద 450 రూపాయలు పెరిగింది.రైతుల మీద ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా పెంచిన రసాయనకి ధరలు వెంటనే తగ్గించాలని తులసి రెడ్డి డిమాండ్ చేశారు. మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్లు డీజిల్ కొరతతో రైతులు విలువిల లాడిపోతున్నారు. ట్రాక్టర్లకు డీజిల్ లభించడం లేదు. వరి కోత యంత్రాలకు డీజిల్ లేని కారణంగా వరి కోతలు నిలిచిపోతున్నాయి. ఆక్వా రైతుల పరిస్థితి దయ నీయం.ఏరియేటర్ల నిర్వహణకు డీజిల్ అవసరం. డీజిల్ లభించని కారణంగా ఆక్వా రైతులు కోట్ల రూపాయలు నష్టపోతున్నారు.వారి బాధ వర్ణనా తీతం. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలోనే డీజిల్, పెట్రోల్ కొరత ఉండడం రాష్ట్ర ప్రభుత్వ అసమర్ధతకు, చేతగాని తనానికి నిదర్శనమని తులసి రెడ్డి ధ్వజమెత్తారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని పెట్రోలు,డీజిల్ కొరత లేకుండా చూడాలని తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కదిరి ప్రసాద్ గౌడ్, ఎస్సీ సెల్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లెం విజయభాస్కర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి,ఉత్తన్న తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, నామా వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాలలో అవకతవకలు

## -ఎమ్మార్వోకు పత్తికొండ బీజేపీ నాయకుల వినతి



**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం :**పత్తికొండ మండలం లోని అంగన్వాడి కేంద్రాలలో జరుగుతున్న అవకతవ కలపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు కరణం నరేష్ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మార్వో గారికి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా అసెంబ్లీ కో కన్వీనర్ నాయుడు మాట్లాడుతూ పత్తికొండ మండలం లోని, పట్టణంలోని అనేక అంగన్వాడి కేంద్రాలు సరైన విధంగా పనిచేయడం లేదని, అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కరువైందని తెలిపారు.అంగన్వాడి కేంద్రాలు సమయానికి తెరుచుకోవడం లేదని, టీచర్లు హాజరు కాకపోవడం వల్ల ఆయాలు మాత్రమే సెంటర్లను నడుపు తున్నారని అన్నారు. గర్భిణీలు, బాలింతలు మరియు చిన్నారులకు ఇవ్వాల్సిన పౌష్టికాహారం సక్రమంగా అందడం లేదని, రికార్డులు తారుమారు చేయడం వంటి అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు.కొన్ని కేంద్రాలు కేవలం సరుకుల పంపిణీ సమయాల్లో మాత్రమే తెరుచుకుంటున్నాయని, పిల్లలకు విద్యా కార్యక్రమాలు సరిగా నిర్వహించడం లేదని తెలిపారు. పౌష్టికాహార నాణ్యతలో కూడా లోపాలు ఉన్నాయని, సూపర్వైజర్లు మరియు సిడిపిఓ పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఈ పరిస్థితి మరింత దిగజారుతోంద న్నారు. ఈ సమస్యలు చిన్నారుల భవిష్యత్తుతో పాటు గర్భిణీలు, బాలింతల ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని పేర్కొన్నారు.బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బ్రహ్మయ్య మాట్లాడుతూ వెంటనే విచారణ జరిపి నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు గైకొని సాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంగన్వాడి కేంద్రాల్లో సమయపాలనను కచ్చితంగా అమలు చేయాలని, పౌష్టికాహార పంపిణీ పారదర్శకంగా జరిగేలా చూడాలని కోరారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు ప్రజాస్వామ్యపరమైన ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. దీనిపై స్పందించిన తాసిల్దార్ అంగన్వాడి సెంటర్ల పర్యటన కచ్చితంగా చేస్తామని అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. లీగల్ సెల్ కన్వీనర్ అడ్వకేట్ భాస్కర్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు రవీంద్ర ప్రధాన కార్యదర్శి భగవాన్ రావు, మాలేఖరి వీరేష్, కరణం చంద్రన్న, గోరంట్ల, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు హరీష్ నాయక్, గోవిందు, లక్ష్మీనారాయణ, వీరేశప్ప స్వామి, తదితరులు పాల్గొన్నారు




## 30న అంగరంగ వైభవంగా తిమ్మనచెరువు లక్ష్మీనరసింహస్వామి తిరుణాల

**పెద్దపప్పూరు - సూర్య వాస్తవం:** పెద్దపప్పూరు మండలంలోని తిమ్మన చెరువు లక్ష్మీ నరసింహస్వామి జయంతి సందర్భంగా ఈనెల 30న అంగ రంగ వైభవంగా తిరుణాలను నిర్వహిస్తామని మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన దేవస్థానాన్ని పరిశీలించి అర్చకులు, ఆలయ కమిటీ వారితో మాట్లాడారు. తిరుణాల ప్రత్యేకంగా నిర్వహించేందుకు కావాల్సిన ఏర్పాట్లను త్వరగా పూర్తిచేయాలని తెలిపారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట టీడీపీ సీనియర్ నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి, బీసీ రామకృ ష్ణారెడ్డి, భాస్కర్ రెడ్డి, శశిధర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఇంటి దేవర కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గుమ్మనూరు ఈశ్వర్



**గుత్తి - సూర్యా వాస్తవం:** గుత్తి పట్టణం 11వ వార్డ్ లో నివాసం ఉంటున్న జనసేన పార్టీ సీనియర్ నాయకుడు క్యాస్ట్ వెంకటేష్ అన్న కుమారుడు పోతుల రాజు ప్రత్యేక ఆహ్వానం మేరకు ఇంటి దేవరకు ముఖ్య అతిథిగా హాజరైన గుంతక ల్లు నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం తనయుడు గుత్తి మరియు పామిడి ఇంచార్జ్ యువనేత గుమ్మనూరు ఈశ్వర్ కి ఘన స్వాగతం పలికారు అనంతరం స్వామివారిని దర్శించుకుని దేవర కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కా ర్యక్రమంలో పాల్గొన్న గుత్తి పట్టణం మండల కూటమి నాయకులు కార్యకర్తలు అనుబంధ కమిటీ సభ్యులు మరియు బంధుమిత్రులు హాజరు కావడం జరిగింది.

## రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

### - టిడిపి రాయచోటి రూరల్ అధ్యక్షుడు గండికోట సుధాకర్



**రాయచోటి-సూర్య వాస్తవం :** రాయచోటి నియోజకవర్గ అభివృద్ధి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తోనే సాధ్యమని టీడీపీ రాయచోటి రూరల్ మండల అధ్యక్షుడు గండికోట సుధాకర్ అన్నారు. మంగళవారం రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖమంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశాలు మేరకు రాయచోటి మండలం చెన్నముక్కపల్లి గ్రామ పంచాయతీలోని దేడ్ లాక్ మసీదు సమీపంలో ఉన్న ఉర్దూ స్కూల్ వద్ద 10 లక్షల రూపాయలు నిధులతో ఏర్పాటు చేయనున్న సీసీ రోడ్డు నిర్మాణం పనులకు టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి సుధాకర్ భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ల సహకారంతో స్థానిక ఎమ్మెల్యే, మంత్రి మండిపల్లి రాయచోటి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ఆయన చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామాలలో అభివృద్ధి జరగలేదని, కేవలం ధనార్జనే ధ్యేయంగా వైసీపీ నేతలు ప్రజా సొమ్మును దోచుకున్నారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసిన గ్రామీణ వ్యవస్థను, నేడు కూటమి ప్రభుత్వం అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి ప్రభాకర్ రెడ్డి, డీలర్ చంద్రమోహన్ రెడ్డి, ఏఎంసి డైరెక్టర్ మస్తాన్ వలి, టిడిపి నాయకులు కావలి సిద్దా రెడ్డి, బాబ్జి, నూరుద్దీన్, రహంతూ, పీరా, తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో తాగునీటి ఎద్దడి రాకూడదు

### - అధికారులకు ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశాలు
### - ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో కలెక్టర్‌తో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ భేటీ..
### - తాగునీటిపై కీలక నిర్ణయాలు



**ఉరవకొండ - సూర్య వాస్తవం :** రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అనంతపురం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. వేసవి తీవ్రత దృష్ట్యా, అనంతపురం జిల్లాలో తాగునీటి సరఫరా పరిస్థితులు, ప్రజలు ఎదు ర్కొంటున్న సమస్యల గురించి జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్‌తో పాటు సంబంధిత శాఖా అధికారులతో సమగ్రంగా చర్చించడం జరిగింది. జిల్లాలోని ప్రతి గ్రామానికి తగి నంత తాగునీరు అందేలా చర్యలను వేగవంతం చేయాలని, ఏవైనా లోపాలు ఉంటే వెంటనే పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా, ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని స్పష్టం చేశారు.

## జర్నలిస్ట్ హత్యకు పాల్పడిన దుండగులను నడిరోడ్డుపై ఎన్కౌంటర్ చేయాలి

### - ఈ హత్య వెనుక ఎంతవారు ఉన్నా ఉపేక్షించకూడదు
### - దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కోలా ప్రసాద్



**పులివెందుల -సూర్య వాస్తవం :** చిత్తూరు జిల్లా వీకోటలో ఆంధ్రజ్యోతి విలేఖరిగా పనిచేస్తున్న జగన్మోహన్ రెడ్డి ఉదయాన్నే వాకింగ్ వెళ్తే ఆయనను మారునాయుధాలతో నరికిచంపడం దారుణమని, విలేకరిని నరికి చంపిన వ్యక్తిని పోలీసులు ఎన్కౌంటర్ చేయాలని దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కోలా ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన తనకార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూప్రజల కోసం పాటుపడుతూ ప్రభుత్వం ప్రజల మధ్య వారధిగా ఉన్న జర్నలిస్టులను హత్య చేయడం దారుణం అన్నారు. వాస్తవాలను వెలుగులోకి తేవడం ప్రజల పక్షాన నిలబడడం, రాత్రనక పగలనక, రౌడీలు దేశద్రోహులు స్మగ్లర్లు, వారి చేసే విధ్వంశాలను, ఎండగడుతూ ఎప్పటికప్పుడు ప్రభుత్వాలకు అందజేస్తూ,రహస్యంగా వారి కదలికలపై నిషిత అన్వేషణ చేస్తూ ఎంతోమంది ప్రాణాలను అర్పించారు అన్నారు. అయినా బెదిరింపులకు బెదరక గొంతుపై కత్తి పెట్టినా కూడా అధరక, బెదరక ధైర్యంగా పోరాడే ఏకైక వ్యక్తి జర్నలిస్ట్ అన్నారు. హత్యచేసిన వారిని వెంటనే పోలీసులు అరెస్టు చేసి ఎన్కౌంటర్ చేయాలని ఆయన అన్నారు. జర్నలిస్ట్ కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్గ్రేషియా కింద 50 లక్షలు ఇస్తూ వాళ్ళ కుటుంబాన్ని ఆదుకోవాలని అన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9948461699 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad )

# కమనీయం
# శ్రీ వీరబ్రహ్మేంద్రుని మహాప్రసాదం

- ముగిసిన 333వ ఆరాధన గురుపూజ మహోత్సవాలు
- మహా ప్రసాదం కోసం పోటెత్తిన భక్తులు



**బ్రహ్మంగారిమఠం – సూర్యా వాస్తవం:** ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి మహా ప్రసాదం పంచిన మఠాధిపతులు శ్రీవీర ధర్మజ వెంకటాద్రి స్వాములవారు జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి 333వ ఆరాధన గురుపూజ మహోత్సవాలు 23వ తేదీ నుండి మొదలై స్వాములవారి మహా ప్రసాద వితరణతో ఘనంగా ముగిశాయి మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీర ధర్మచ వెంకటాద్రి స్వాముల వారి ఆధ్వర్యంలో మేనేజర్ ఈశ్వరయ్య చారి పర్యవేక్షణలో కాబోయే మేనేజర్ పి పి యన్ ప్రసాద్ నిర్వహణ లో వారం రోజులు పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు పూజా కార్యక్రమాలు మహా యజ్ఞయాగాలతో ఆలయ విద్యుత్ కాంత అలంకరణలతో అద్భుతంగా అంగరంగ వైభవంగా ఆరాధనా గురుపూజ మహోత్సవాలు జరిగాయి సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మఠం అధికారులు అన్ని ఏర్పాట్లను చేసి భక్తులకు సౌకర్యాలను కల్పించారు.

**కమనీయం వీరబ్రహ్మేంద్రని మహాప్రసాదం**

శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆరాధన గురు పూజ మహోత్సవాల మహా ప్రసాదం అది దక్కిన పూర్వజన్మ సుకృత భాగ్యమని ఎందరో భక్తుల ప్రగాఢ నమ్మకం అలాంటి మహా ప్రసాదం కోసం ఆరాధన గురుపూజ మహోత్సవాల్లో చివరి రోజు అయిన మహా ప్రసాద వినియోగం రోజు భక్తులు సుదూర ప్రాంతాల నుండి వచ్చి మహా ప్రసాదం స్వీకరించి తమ తిరుగు ప్రయాణం చేస్తారు అంతటి విశిష్టత శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మహా ప్రసాదానికి ఉంది

**మహా ప్రసాదానికి మఠాధిపతుల ప్రత్యేక పూజలు**

శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆరాధన గురు పూజ మహోత్సవాల సందర్భంగా చివరి రోజు భక్తులకు అందించే మహా ప్రసాదానికి మఠాధిపతులు శ్రీ వీర బ్రహ్మజ వెంకటాద్రి స్వాముల వారు వేద పండితుల మంత్రోచనాల మధ్య శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అనంతరం మహా ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేశారు

**పోటెత్తిన భక్తులు**

శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆరాధన గురు పూజ మహోత్సవాల సందర్భంగా చివరి రోజు మహా ప్రసాదం కోసం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు క్యూ లైన్ లలో బారులు తీరారు స్వామివారి మహా ప్రసాదం తమకు దక్కిన భాగ్యమని ఆ మహా ప్రసాదం అందిన తర్వాతే తమ ప్రయాణం అనే విధంగా భక్తులు మహా ప్రసాదం కోసం వేచి ఉంటారు

ముగిసిన ఆరాధన గురుపూజ మహోత్సవాలు. శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి 333వ ఆరాధన గురు పూజ మహోత్సవాలు వారం రోజులపాటు అత్యంత వైభవంగా జరిగి చివరి ఘట్టమైన మహా ప్రసాద వినియోగంతో ముగిశాయి ఈ ఆరాధన గురుపూజ మహోత్సవాల కు సహకరించిన ఉభయ దాతలకు భక్తాదులకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా మఠం యాజమాన్యం వారు కృతజ్ఞతలు తెలిపారు.

## పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యమే ప్రజల ఆరోగ్యం



**పులివెందుల– సూర్య వాస్తవం :**పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యమే ప్రజల ఆరోగ్యం అని మునిసిపల్ కమీషనర్ మునికుమార్ పేర్కొ న్నారు. ప్రపంచ కార్మికుల భద్రత, ఆరోగ్య దినోత్సవం (ఏప్రిల్ 28) సందర్భంగా పులి వెందుల పురపాలక సంఘం పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యం మరియు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని పురపాలక సంఘం కమీషనర్ మునికుమార్ , ఐసిటీసి కౌన్సిలర్ వెంకట సుబ్బయ్య సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీటీసీ కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు తమ పనిలో ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలు, ప్రమాదాలు, మరియు వాటిని నివారించే మార్గాలపై ఆయన వివరించారు. కార్మికులకు వ్యక్తిగత రక్షణ పరికరాల పి పి ఈ వినియోగం, శుభ్రత, మరియు ఆరోగ్య పరీక్షల ప్రాముఖ్యతను తెలియజేశారు. ముఖ్యంగా వేసవికాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలను విశదీకరించారు అలాగే అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, తగిన సూచనలు తెలియజేశారు.ఈ సందర్భంగా మునిసిపల్ కమీషనర్ మునికుమార్ మాట్లాడుతూ, “పారిశుద్ధ్య కార్మికులు మన సమాజానికి అండగా నిలిచే ముఖ్యమైన సిబ్బంది. వారి ఆరోగ్యం, భద్రతకు పురపాలక సంఘం ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని ప్రతి 6 నెలలకు పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారి హెల్త్ ప్రొఫైల్ ను రికార్డు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పురపాలక మేనేజర్ సతీష్ కమలాకర్,స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు పర్యావరణ ఉ పారిశుద్ధ్య కార్యదర్శులు మరియు పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.



## కూటమి ప్రభుత్వ వైఫల్యం వలనే డీజిల్ కొరత

- ప్రజల ఇబ్బందులు
- ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని,
-సమస్యలు పరిష్కరించకపోతే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తాం



**పులివెందుల– సూర్య వాస్తవం :**

రాష్ట్రం లో చంద్రబాబు నాయుడు అసమర్థత వలనే డీజిల్ కొరత ఏర్పడిందని వైసిపి నాయకులు కూటమి ప్రభుత్వ వైఫల్యం పై ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా పాత ఎమ్మెల్యే ఆఫీస్ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ...గత 5 రోజులుగా ప్రజలు ఇబ్బంది పడుతున్న కూడా ఇంతవరకు చంద్రబాబు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని,డీజిల్ కొరత వలన రైతులు, వ్యాపారులు,చిన్న తరహా పరిశ్రమల యజమానులు, చిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.చివరకు 108,104 మెడికల్ ఎమర్జెన్సీ వాహనాలు కూడా డీజిల్ లేక స్తంభించిపోయాయి,ఈ కూటమి ప్రభుత్వం లో, రైతులు యూరియా కోసం, మహిళలు గ్యాస్ కోసం, ప్రజలు రేషన్ బియ్యం కోసం, ఇప్పుడు డీజిల్ కోసం పడిగాపులు పడుతున్న ఈ ప్రభుత్వానికి ఏ మాత్రం చీమకుట్టినట్లు అయినా చలనం లేదు, కేవలం అమరావతి పేరుతో డబ్బులు దండుకోవడం , మంత్రులు సింగపూర్ లో షికార్లు చేయడం తప్ప ప్రజా సమస్యల పరిష్కారం పై ఏ మాత్రం చిత్తశుద్ధి లేదుఅని,ఇకనైనా ఈ ప్రభుత్వం కళ్లు తెరిచి ప్రజలు పడుతున్న బాధలను దృష్టి లో పెట్టుకొని డీజిల్ సమస్యను పరిష్కరించాలి అని లేకపోతే ప్రజల తరుపున వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని తెలియచేసారు.

ఈ కార్యక్రమం లో మాజీ మునిసిపల్ చైర్మెన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మెన్ చిన్నప్ప, రాష్ట్ర నూర్భాష చైర్మెన్ రసూల్, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్,రాష్ట్ర బూత్ కమిటీ నాయకులు చంద్రమౌళి, కో ఆప్షన్ చంద్రమౌళి,మాజీ కౌన్సిలర్ లు పురుషోత్తం, నాగరాజు వైసీపీ నాయకులు నరసింహా రెడ్డి, వీరా రెడ్డి,కనక, కార్తీక్, ఈశ్వరయ్య,ఫైర్ రామకృష్ణ,గోపాల్ రెడ్డి,నాగరాజు, రవి ,అంజనప్ప,కృష్ణమూర్తి సంపత్ ,రాయుడు,కిరణ్, ప్రశాంత్, శ్రీరాములు, వీరయ్య, ఎల్లారెడ్డి, ఖలందర్, విజయ్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు

## జర్నలిస్టుల రక్షణ కోసం ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలి

**- అమరావతి జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్. జైనుల్లా ఆబెద్దీన్ బాష**



**రాయచోటి–సూర్య వాస్తవం:** ప్రపంచ వ్యాప్తంగా జర్నలిస్టులకు విధి నిర్వహణలో భద్రత కరువవుతోందని, అపాయకరమైన ప్రాంతాల్లో రిపోర్టింగ్ కష్టంగా మారిందని నివేదికలు హెచ్చరి స్తున్నాయని అమరావతి అక్రిడేషన్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్ జైనుల్లా ఆబెద్దీన్ భాష, అలియాస్ అభినయ్ అన్నారు. మంగళవారం ఆంధ్ర పత్రిక విలేకరితో ఆయన మాట్లాడుతూ జర్నలి స్టుల రక్షణ కోసం, వారిపై జరిగే దాడులను అరికట్టడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. హక్కులు: పాత్రికేయుల రక్షణ అంటే, ఎటువంటి భయం లేకుండా సమాచారాన్ని సేకరించి, ప్రజలకు అందించే హక్కును కాపాడటం.జర్నలిస్టులపై హింసను ఆపడానికి మరియు వారి భద్రతను నిర్ధారించడానికి కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు డిమాండ్ చేశారు.

## జీవన ఎరువులపై రైతులకు అవగాహన



**చెన్నూరు–సూర్య వాస్తవం:** పచ్చి రొట్ట ఎరువులు, యూరియా, డి ఏ పి జీవన ఎరువులను ఏ విధంగా వాడాలి వంటి వాటిపై రైతులకు జిల్లా వనరుల కేంద్రం అగ్రికల్చర్ అధికారి కే. స్వాతి అవగాహన కల్పించారు. మండలంలోని ఉప్పరపల్లి గ్రామం లో మంగళవారం జిల్లా వనరుల కేంద్రం కడప ఏవో ఖ. స్వాతి రైతులకు పచ్చిరొట్ట ఎరువులు యూరియా డిఏపి జీవన ఎరువులు వాడకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా రైతులకు పచ్చిరొట్ట ఎరువుల యొక్క ప్రాముఖ్యత వాటి యొక్క వినియోగంతో వచ్చే లాభాలు, పిఎండిఎస్ ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్, వేస్ట్ బయోడికంపోజర్ వల్ల చేకూర్చే ప్రయోజనాలు వంటి అనేక విషయాలను రైతులకు కులంకషంగా వివరించడం జరిగింది. ఇందులో పి.యం.డి.ఎస్ వేయడం వల్ల 30 రకాల విత్తనాలతో పొలంలో వేరువ్యవస్థ రకరకాల స్థాయికి చేరుకోవడం వల్ల భూమి గుల్లబారి సహజంగా సూక్ష్మజీవుల క్రియకు తోడ్పడుతుందని తెలిపారు. అలాగే అధిక యూరియాని వాడకాన్ని తగ్గించి అజోల్ల,అజోస్పైర్లం వంటి జీవన ఎరువులను వాడవల్సిందిగా రైతులకు సూచించడం జరిగింది. పిఎస్బి, ఫాస్ఫరస్ సాలివిలైజింగ్ బ్యాక్టీరియా వినియోగించడం వల్ల అధిక యూరియాను వినియోగించే సమస్య నుండి అధికమించి ఎక్కువగా ఖర్చు పెట్టే సమస్య నుండి రైతులు ప్రయోజనం పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమలి, విఏఏ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి సమ్మర్ ఎగ్జిబిషన్‌ను సద్వినియోగం చేసుకోవాలి





**ప్రొద్దుటూరు–సూర్య వాస్తవం :** వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి సమ్మర్ ఎగ్జిబిషన్ ను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు బుక్కపట్నం జయ శంకర్ తెలిపారు. మంగళ వారం ప్రొద్దుటూరు మండ లంలోని కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని మండి మార్కెట్ సమీపంలో ఏర్పాటు చేసిన వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి సమ్మర్ ఎగ్జిబిషన్ ను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎగ్జిబిషన్ పరికరాలను, ఎగ్జిబిషన్ ప్రక్కన ఏర్పాటు చేసిన అయోధ్య రామ మందిరం సెట్టింగ్ ను చూసి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రొద్దుటూరు పట్టణంలోని పేద, మధ్య తరగతి ప్రజలు, అయోధ్యకు వెళ్లే సమయం లేని వారికి ప్రయోజనకరమని తెలిపారు. నిర్వాహకులు బుక్కపట్నం జయ శంకర్ మాట్లాడుతూ ఎగ్జిబిషన్ కు ప్రవేశం 100 రూపాయలని, జెయింట్ వీల్, బ్రేక్ డ్యాన్స్ వంటి వినోద పరికరాలకు 100, 50 అని తెలిపారు. సరసమైన ధరలకు తినుబండారాలు అందుబాటులో వున్నాయని వివరించారు. అయోధ్య రామ మందిరం సెట్టింగ్ ను ప్రజలు ఉచితంగా వీక్షించే అవకాశం కల్పించామని తెలిపారు. ప్రొద్దుటూరు, పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ ఎంపిపి నంద్యాల రాఘవ రెడ్డి, టిడిపి నాయకులు సురేష్ నాయుడు, నంద్యాల హరినాథరెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, మాజీ సర్పంచి కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, నాయకులు మాడెం సుధాకర్ రెడ్డి, రాజువారి వెంకట సుబ్బయ్య, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పోరేషన్ డైరెక్టర్ శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.